ఆంధ్రజ్యోతి
****
ANDHRAJYOTHY
నల్లగొండ
5
శుక్రవారం 18 ఏప్రిల్ 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.142	220	240
సూర్యాపేట	రూ.170	240	270
నల్లగొండ	రూ.142	206	234

ఉష్ణోగ్రత గరిష్ఠం 39.0 । కనిష్ఠం 23.4

అంగన్‌వాడీలా

- అద్దెభవనాల్లో కేంద్రాల నిర్వహణ
- రేకులషెడ్డు, ఇరుకు గదులతో చిన్నారులకు ఇక్కట్లు
- వేసవి ఉక్కపోతతో తల్లడిల్లుతున్న పిల్లలు



ఉక్కపోతతో అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అసౌకర్యాల నడుమ అద్దె భవనాల్లో నడుస్తున్న కేంద్రాల్లో ఇప్పటికే చిన్నారులు ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, వేసవి కాలం కావడంతో ఉక్కపోతకు గురవుతున్నారు. ఇదిలా ఉండగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో చాలాచోట్ల అద్దె భవనాల్లోనే కేంద్రాలు కొనసాగుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో రేకులషెడ్డులో కేంద్రాలు ఉండటంతో గదిలో వేడిమికి చిన్నారులు విలవిల్లాడుతున్నారు. ముఖ్యంగా పట్టణాల్లో అద్దె తక్కువగా ఉండటంతో అన్నిసౌకర్యాలు ఉన్న భవనాలు దొరకడం లేదు. దీంతో చిన్నగదుల్లో పెద్దసంఖ్యలో పిల్లలతో నిర్వహిస్తున్న కేంద్రాల్లో పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది.

- వివరాలు 6లో

ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల పై నియంత్రణేదీ!

ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలపై ప్రభుత్వ నియంత్రణ కొరవడింది. అయిదారేళ్లకు ఒక్కసారి కూడా ఏజెన్సీల పనితీరుపై ఆడిట్ కొరవడింది. కనీస ప్రమాణాలను పాటించకుండా ఏజెన్సీలను నిర్వహిస్తోన్న వారిపై చర్యలు తీసుకోవడంలో అధికార యంత్రాంగం విఫలమవుతోంది. ఏజెన్సీల ద్వారా పనిచేసే కార్మికులు, ఉద్యోగుల భద్రత, సంక్షేమం విషయంలో ఏజెన్సీల నిర్లక్ష్యంపై పలు సందర్భాల్లో ఉద్యోగులు, కార్మికులు ఆందోళనలకు దిగినా పరిస్థితిలో మార్పు రాలేదు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)



- ఏళ్లుగా కరువైన ఆడిట్
- గాడితప్పిన ఏజెన్సీలతో అవస్థలు పడుతోన్న కార్మికులు, ఉద్యోగులు
- లష్కర్, హెల్పర్ పోస్టులకోసం లాటరీ ద్వారా ఏజెన్సీ ఎంపిక చేయాలని నిర్ణయం
- నీటిపారుదలశాఖలో వీటికోసం తాజాగా నోటిఫికేషన్
- ఏజెన్సీలను క్రమబద్ధీకరించకుండా లాటరీ విధానం వద్దనే అభిప్రాయాలు

జిల్లాలో ఖచ్చితమైన ప్రమాణాలు పాటించే ఏజెన్సీ లేవో, నామమాత్రంగా ఉన్న ఏజెన్సీలేవో తేల్చడంలేదు. నీటిపారుదలశాఖ వంటి కీలక శాఖల్లో లష్కర్లు, హెల్పర్ల భారీ నియామకాలకు లాటరీ పద్ధతిలో ఏజెన్సీలను ఎంపిక చేయాలని నిర్ణయించడం సరికాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముందస్తుగా ఏజెన్సీలను పూర్తిస్థాయిలో క్రమబద్ధీకరించాలని, ఆతర్వాతే లాటరీ విధానంలో ఏజెన్సీల ఎంపిక చేపట్టాలనే డిమాండ్ వస్తోంది.

జిల్లాలో భారీగా ఏజెన్సీలు.. అంతేస్థాయిలో ఫిర్యాదులు

జిల్లాలో ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల పనితీరుపై తీవ్రస్థాయి లో విమర్శలున్నాయి. జిల్లాలో 2021 నుంచి ఇప్పటి వర కు ఉపాధికల్పనా కార్యాలయంలో ఎన్‌ప్యానల్ అయిన 97 ఏజెన్సీలున్నాయి. ఆసుపత్రులు, మున్సిపాలిటీల్లో పారిశుధ్య నిర్వహణతోపాటు, డీటీపీ ఆపరేటర్లు, వాచ్‌మెన్లు, నాలుగో తరగతి ఉద్యోగులు, క్లరికల్ క్యాడర్‌లో పనిచేసే ఉద్యోగులను పలు శాఖల్లో ఔట్‌సోర్స్ ఏజెన్సీలు నిర్వహిస్తున్నాయి. వీటిలో కొన్ని ఏజెన్సీలు నిబంధనల ప్రకారం పనిచేస్తుండగా, మరికొన్ని ఉనికిలో లేకుండా పోయా యి. ఇంకొన్ని ఏజెన్సీలు కనీస ప్రమాణాలు పాటించడంలేదు. తమ ఏజెన్సీల కింద పనిచేసే కార్మికులు, ఉద్యోగులకు సంబంధించి పీఎఫ్, ఈఎస్‌ఐలకు సంబంధించి ఎంప్లాయర్ వాటాలు సైతం సంవత్సరాల తరబడి చెల్లించకుండా కాలయాపన చేస్తున్నట్లు సమాచారం. మరికొన్ని ఏజెన్సీలు వేతనాల్లో కమీషన్లు భారీగా కోత విధిస్తున్నారనే ఆరోపణలున్నాయి. కొన్ని ఏజెన్సీలు తక్కువమంది కార్మికులతో ఎక్కువ పని చేయించి, లేని కార్మికుల పేర్లను జతచేసి వేతనాలు పొందుతున్నాయనే....

- మిగతా 8వ పేజీలో...

లాటరీ ద్వారా ఎంపిక వద్దనే డిమాండ్లు

నీటిపారుదలశాఖ, నల్లగొండ డివిజన్ పరిధిలో 229 లష్కర్లు, 56 హెల్పర్ల పోస్టులకు అవుట్‌సోర్సింగ్ సేవల ద్వారా నియామకాలు చేపట్టాలని చీఫ్ ఇంజనీరింగ్ కార్యాలయం నిర్ణయించింది. ఈ మేరకు జిల్లాలో ఎన్‌ప్యానల్ అయిన ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల నుంచి ఈ నెల 19 సాయంత్రంలోగా దరఖాస్తు చేసుకోవాలని నోటిఫికేషన్ ఇచ్చారు. ఆసక్తి చూపిన ఏజెన్సీల నుంచి లాటరీ పద్ధతిన ఏజెన్సీని ఎంపిక చేయాలని అధికారులు నిర్ణయించారు. అయితే కీలకమైన నీటిపారుదలశాఖలో ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీని లాటరీ పద్ధతిలో ఎంపికచేయాలనే నిర్ణయంపై విమర్శలు వస్తున్నాయి. జిల్లాలో పుట్టగొడుగుల్లా ఉన్న ఔట్‌సోర్స్ ఏజెన్సీల్లో చాలా ఏజెన్సీలపై పలు ఆరోపణలున్నాయని, అదేవిధంగా ఆయా ఏజెన్సీల్లో పనిచేసే కార్మికులు, ఉద్యోగులే అనేక సందర్భాల్లో వేతనాలకోసం, ఈఎస్‌ఐ, పీఎఫ్ షేర్లకోసం కలెక్టర్లకు వినతిపత్రాలిచ్చిన ఘటనలు వెలుగులోకి వచ్చాయి. కొన్ని ఏజెన్సీల పని విధానంలోనూ ఆయా శాఖల ఉన్నతాధికారులు అభ్యంతరాలు, అసంతృప్తి వ్యక్తం చేస్తున్నా రాజకీయ పలుకుబడి, అధికారుల ఉదాసీనతతో నెట్టుకొస్తున్నారని, ఇలాంటి సందర్భంలో పెద్దసంఖ్యలో ఉద్యోగాలకు సంబంధించిన వ్యవహారంలో లాటరీ పద్ధతిలో ఏజెన్సీని ఎంపికచేయడం తగదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తొలుత జిల్లాలోని ఔట్‌సోర్స్ ఏజెన్సీల పనితీరుపై నిర్ణీత ప్రమాణాల మేరకు ఉన్న సంస్థలను గుర్తించాలని, ఆరోపణలు, ఫిర్యాదులున్న ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని మొత్తంగా ఔట్‌సోర్స్ ఏజెన్సీ వ్యవస్థను క్రమబద్ధీకరించిన తర్వాతే లాటరీ విధానం ప్రవేశపెడితే బాగుంటుందని, లేదంటే ప్రమాణాలు లేని ఏజెన్సీకి లాటరీ వస్తే ఈ ఉద్యోగుల భవిష్యత్, నీటిపారుదలశాఖకు తలనొప్పి తప్పదనే అభిప్రాయం వెల్లడవుతోంది. ఈ నియామకాలకు కనీస ప్రమాణాలు, నియమ, నిబంధనలు రూపొందించి వాటికి అర్హత ఉన్న ఏజెన్సీలే లాటరీలో పాల్గొనేలా మార్పులు చేయాలని, లేదంటే దళారులు ఏజెన్సీల ముసుగులో ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్‌ని దక్కించుకుంటే ఆతర్వాత నిర్వహణలు ఇటు ఉద్యోగులకు, అటు నీటిపారుదలశాఖకు తలనొప్పి తప్పదనే అభిప్రాయాలు వెల్లడవుతున్నాయి. కలెక్టర్ సహా జిల్లా ఎన్‌ప్యానల్‌మెంట్ కమిటీ పునరాలోచించి నిర్ణయం తీసుకోవాలనే సూచనలు వస్తున్నాయి.

భూభారతితో భూ సమస్యలకు పరిష్కారం

- ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్, కలెక్టర్ ఇలా త్రిపాఠి
- పలు మండలాల్లో అవగాహన సదస్సులు



దేవరకొండ మండలం కొండభీమనపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్, పక్కన కలెక్టర్ ఇలాత్రిపాఠి

దేవరకొండ, చింతపల్లి, కొండమల్లేపల్లి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): భూభారతి చట్టంతో భూసమస్యలు పరిష్కారం అవుతాయని, ప్రతి రైతుకు మేలు జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకువచ్చిందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. గురువారం దేవరకొండ మండలం కొండభీమనపల్లి, చింతపల్లి కొండమల్లేపల్లి మండలకేంద్రాల్లో భూభారతి చట్టం (భూమి హక్కుల రక్షణచట్టం 2025)పై రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సుల్లో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూసమస్యలతోపాటు ఇళ్ల స్థలాలకు సంబంధించిన సమస్యలను భూభారతితో పరిష్కరించుకోవచ్చునన్నారు. ధరణి పోర్టల్‌లో లేని అనేక సమస్యలకు పరిష్కారం భూభారతి చట్టం ద్వారా పరిష్కారమవుతుందన్నారు. భూభారతిచట్టంపై గ్రామ, గ్రామాన రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. వందేళ్ల వరకు ఈచట్టం ఉపయోగపడుతుందని తెలిపారు. జూన్ 2 నుంచి భూభారతి చట్టం పోర్టల్ పని చేస్తుందన్నారు. ఎలాంటి భూ వివాదాలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ఎన్నోరోజుల ఆలోచనచేసి మేధావులు, అధికారులు అందరితో చర్చించిన పిదప ప్రభుత్వం ఈ చట్టం రూపొందించడం జరిగిందన్నారు.

రైతు భూములకు భరోసా : కలెక్టర్

రైతు భూములకు భరోసా కల్పించే చట్టం భూభారతి అని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. ధరణి పోర్టల్‌లోలేని అనేక సమస్యలకు పరిష్కారం భూభారతిలో దొరుకుతుందని, జూన్ 2 నుంచి ఆన్‌లైన్‌లో చట్టం పోర్టల్ పనిచేస్తుందన్నారు. భూములకు సంబంధించిన సమస్యలపై రైతులు మీసేవా లాగనే భూభారతి పోర్టల్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చునని, ఏదైనా సమస్య పరిష్కారానికి దరఖాస్తు చేస్తే నిర్దేశించిన సమయంలో పరిష్కారమవుతాయన్నారు. ఒకవేళ పరిష్కరించలేకపోతే చలాన్ ద్వారా చెల్లించిన మొత్తాన్ని తిరిగి చెల్లించడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం డిసెంబరు 31న భూభారతి చట్టంలోని నిబంధనల ప్రకారం రికార్డులను అప్‌డేట్ చేయడం జరుగుతుందని తెలిపారు. భూభారతి పోర్టల్‌లో నమోదైన రికార్డుల ఆధారంగానే రైతులకు బ్యాంక్ రుణాలను రైతులకు అందజేస్తుందన్నారు. రైతులు భూభారతి చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భూములకు సంబంధించిన నక్ష, సర్వే నెంబర్ ఇతర వివరాలన్నీ శాస్త్రీయమైన పద్ధతిలో ఈ చట్టంలో పొందుపర్చడం జరిగిందన్నారు. మ్యూటేషన్లకు సం బంధించి 30 రోజుల్లో మ్యూటేషన్లకు కాకపోతే ఆటోమెటిక్‌గా 31వ రోజు మ్యూటేషన్ అవుతుందన్నారు. ఈ సదస్సుల్లో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, దేవరకొండ ఏఎస్పీ మౌనిక, దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, తహసీల్దార్లు సంతోష్ కిరణ్, రమాకాంత్‌శర్మ, అన్వర్‌హుస్సేన్, ఎంపీడీవోలు డానియేల్ సుజాత,బాలరాజురెడ్డి, మాల్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దొంతం అలివేలూ సంజీవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ లింగంపల్లి వెంకటయ్య, ఏడీఏ శ్రీలక్ష్మీ, ఏవోలు శ్రావణికుమారి, జానకిరాములు, ఉట్కూరి వేమన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల వేణుధర్‌రెడ్డి ఉన్నారు.

సోనియా, రాహుల్‌పై కేసులను ఉపసంహరించుకోవాలి

- కాంగ్రెస్ ఎదుగుదలను చూసి ఓర్వలేకనే కేసులు
- ఎమ్మెల్సీ శంకర్‌నాయక్
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసనలు




దిష్టిబొమ్మను దహనం చేసి మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సోనియా, రాహుల్ గాంధీలపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ డిమాండ్ చేశారు. నేషనల్ హెరాల్డ్ కేసులో ఏఐసీసీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలపై ఈడీ అక్రమంగా చార్జ్‌షీట్ నమోదు చేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఎదుగుదలను చూసి ఓర్వలేక కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నేషనల్ హెరాల్డ్ పత్రిక కేసులో కాంగ్రెస్ అగ్రనేతలపై అక్రమ కేసులు బనాయించిందన్నారు. కాంగ్రెస్ బడుగు, బలహీన వర్గాల కోసం నిరంతరం పనిచేసే పార్టీ అన్నారు. కాంగ్రెస్‌ను బలహీనపరిచేందకు బీజేపీ కుట్ర పన్నుతోందన్నారు. అందులో భాగంగా అగ్రనేతలపై కేసులు పెడుతుందని ఆరోపించారు. దేశంలో కేంద్ర ప్రభుత్వం అరాచక పాలన కొనసాగిస్తుందన్నారు. బీజేపీ ప్రభుత్వంలో దేశ సంపదంతా సంపన్నులే దోచుకుంటున్నారని ఆరోపించారు. దేశం మొత్తం కులగణన చేసి, ఎవరికి దక్కాల్సిన వాటా వారికి ఇవ్వాలని రాహుల్‌గాంధీ పోరాటం చేస్తున్నారని, దీనిని జీర్ణించుకోలేక మోదీ ప్రభుత్వం ఈడీని అడ్డంపెట్టుకొని అక్రమ కేసులుపెడుతుందన్నారు. ఎన్ని కుట్రలు పన్నినా రాహుల్‌గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ముందుకుపోతూ అన్ని వర్గాల పేద ప్రజల హక్కులకోసం పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో నల్లగొండ మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, మార్కెట్ చైర్మన్ జూకూరి రమేష్, నాయకులు కేసాని వేణుగోపాల్‌రెడ్డి, జూలకంటి శ్రీనివాస్, సమద్, పెరిక వెంకటేశ్వర్లు, బొజ్జ శంకర్, ఇంతియాజ్‌హుస్సేన్, అల్లి సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

శిలువపై క్రీస్తు శాంతి సందేశం

నేడు గుడ్ ఫ్రైడే

గుడ్‌ఫ్రైడేకు వేడుకలకు జిల్లాలోని చర్చిలు సిద్ధమయ్యాయి. విద్యుద్దీపాల కాంతులతో అందంగా ముస్తాబు చేసిన చర్చిలను దర్శించుకునేందుకు క్రైస్తవులు అధిక సంఖ్యలో తరలి వెళ్లనున్నారు.



6

హారికను ఆదుకుంటాం

- ఎక్స్ వేదికగా అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు

నాగార్జునసాగర్‌లో రెండేళ్ల కిందట కుక్కల దాడిలో గాయపడి అచేతనస్థితికి చేరిన బాలిక హారికను ఆదుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. మంత్రి దామోదర రాజనర్సింహ ద్వారా బాలిక విషయం తెలుసుకున్న సీఎం గురువారం హారికకు వైద్యసేవలతోపాటు అన్నివిధాలా ఆదుకోవాలని ట్విట్టర్(ఎక్స్) వేదికగా అధికారులను ఆదేశించారు.



వానాకాలం యాక్షన్ ప్లాన్ సిద్ధం



- 11,60,389 ఎకరాల్లో పంటల సాగుపై అంచనా
- పత్తి 5,47,735 ఎకరాల్లో, వరి 5,25,350 ఎకరాల్లో సేద్యం
- విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచనున్న వ్యవసాయ శాఖ

జిల్లాలో వానాకాలం పంటల సాగుకు వ్యవసాయ శాఖ ప్రణాళికలు సిద్ధంచేసింది. ఇందుకు సంబంధించి ప్రభుత్వానికి నివేదిక పంపించింది. వ్యవసాయశాఖ పెట్టిన ఇండెంట్ ప్రకారం ఎరువులు, విత్తనాలను ప్రభుత్వం సరఫరా చేయనుంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే కొంత మేరకు బఫర్ స్టాక్‌ను వ్యవసాయ శాఖ అందుబాటులో ఉంచింది.

- (ఆంధ్రజ్యోతి-నల్లగొండ)

2024 వానాకాలంలో 11,50,556 ఎకరాల్లో వివిధ పంటలు సాగు కాగా, ఈ సారి అంటే 2025 వానాకాలంలో 11,60,389 ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేస్తుంది. వీటిలో ప్రధానంగా పత్తి 5,47,735 ఎకరాల్లో, వరి 5,25,350 ఎకరాల్లో సేద్యం కానుండగా 10 వేల ఎకరాల్లో కందులు వేయనున్నారు. గత ఏడాదితో పోలిస్తే కేవలం 10వేల ఎకరాల్లో మాత్రమే అధికంగా సేద్యమయ్యే అవకాశాలున్నాయి. మే మూడో వారంలో అకాల వర్షాలు కురిసినట్లయితే చాలామంది రైతులు ముందే సిద్ధం చేసుకున్న వేసవి దుక్కుల్లో పత్తి విత్తనాలు వేసుకుంటారు. వ్యవసాయశాఖ నిండు వేసవిలో విత్తనాలు వేయకుండా తదుపరి వర్షాలు వచ్చే అవకాశం ఉన్నప్పుడు మాత్రమే విత్తనాలు వేసుకోవాలని వ్యవసాయ శాఖ సూచిస్తుంది. అదేవిధంగా పెసర్లు 1200 ఎకరాల్లో, వేరుశనగ 1500 ఎకరాల్లో ఈ సారి సాగు చేయనున్నారు. ఇక ఉద్యాన పంటలకు సంబంధించి 73వేలకుపైగా ఎకరాల్లో సాగుకానుంది. ఇందులో ప్రధానంగా కూరగాయలు మిర్చి, పప్పు దినుసు పంటలు కూడా సాగు చేస్తారని ఓ అంచనాకు వచ్చారు.

పత్తి, వరి విత్తనాలతోపాటు

వచ్చే వానాకాలానికి సంబంధించి పత్తి, వరితోపాటు ఇతర పప్పుదినుసుల పంటకు సంబంధించి విత్తనాల అవసరం అధికంగానే ఉంది. గత ఏడాది పత్తి విత్తనాలు 13.80లక్షల ప్యాకెట్లు అవసరం కాగా, ఈసారి 16.81లక్షల ప్యాకెట్ల విత్తనాలు అవసరం ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఒక్కొ ప్యాకెట్‌లో 450 గ్రాముల విత్తనాలు ఉంటాయి. ఇక వరి విత్తనాలకు సంబంధించి గత సంవత్సరం 1,01,352 క్వింటాళ్ల రైతులకు పంపిణీ చేయగా, ఈ సారి 1,26,800 క్వింటాళ్ల విత్తనాలు అవసరం ఉంటాయని వ్యవసాయశాఖ ఇండెంట్ పెట్టింది. ఇందులో ఎంటీయూ 1010, బీపీటీ 5204, ఆర్‌ఎన్‌ఆర్ 15,048, జేజీఎల్ విత్తనాలను కూడా తెప్పించనున్నారు. కందులు 1,250 క్వింటాళ్లు అవసరం ఉండగా గత సంవత్సరం 335 క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ చేశారు. ఇక పెసర్లు గత సంవత్సరం 35 క్వింటాళ్లు, ఈసారి 149 క్వింటాళ్లు ఇక వేరుశనగ గతఏడాది 64 క్వింటాళ్లు ఉపయోగించగా, 1,545 క్వింటాళ్లను పంపిణీ చేయనున్నారు.

వానాకాలం పంటల సాగుకు సర్వసిద్ధం



ప్రభుత్వ ఆదేశాలమేరకు వానాకాలం పంటల సాగుకు సర్వం సిద్ధమైంది. యాక్షన్ ప్లాన్‌ను రూపొందించి ప్రభుత్వానికి పంపించాం. ఈ సీజన్‌కు ఏమేరకు విత్తనాలు, ఎరువులు అవసరమనేదానిపై నివేదికను సిద్ధంచేశాం. సకాలంలో ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచనున్నాం. సమృద్ధిగా వర్షాలు కురిసిన తర్వాత విత్తనాలు వేసుకోవాలి. ఈసారి భారీ వర్షాలు నమోదవుతాయని వాతావరణ శాఖ పేర్కొన్న నేపథ్యంతో పంటల సాగు అనుకున్న దానికంటే ఎక్కువ అయ్యే అవకాశాలు ఉన్నాయి.

- పి.శ్రవణ్ కుమార్, జేడీఏ, నల్లగొండ

ఎరువులు 3,66,869 మెట్రిక్ టన్నులు

ఈసారి వానాకాలం పంటల సాగుకు 3,66,869 మెట్రిక్ టన్నుల అవసరం ఉంటుంది. 2025-26కు సంబంధించి యూరియా 1,44,802 మెట్రిక్ టన్నులు, డీఏపీ 61,343 మెట్రిక్ టన్నులు, ఎంవోపీ 33,758 మెట్రిక్ టన్నులు అవసరం ఉంది. కాంప్లెక్స్ ఎరువులు 1,14,043 మెట్రిక్ టన్నులు ఎస్‌ఎస్‌పీ 12,923 మెట్రిక్ టన్నులు ఈసారి అవసరం ఉంది. ఎరువులు ప్రధానంగా అత్యధికంగా పత్తి, వరి పంటలకు మాత్రమే ఉపయోగించనుండగా స్వలంగా కందులు, ఇతర మెట్ట పంటలకు వేస్తారు. ఈ సారి నైరుతి రుతుపవనాలు ముందుగానే వస్తాయని, భారీ వర్షపాతాలు నమోదవుతాయని భారత వాతావరణ శాఖ తెలియజేసిన నేపథ్యంలో రైతులు ఉత్సాహంగా ఉన్నారు. జూన్ కంటే ముందే వర్షాలు వచ్చినా, లేదంటే జూన్‌లో తొలకరి వర్షాలు కురిసిన వెంటనే సాగయ్యే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో వ్యవసాయశాఖ యంత్రాంగం సర్వం సిద్ధంగా ఉంది. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు వర్షాలు పడటానికి ముందే విత్తనాలు, ఎరువులను సమృద్ధిగా ఉంచడంతో పాటు మండలకేంద్రాలకు సకాలంలో చేరవేసేలా ప్రణాళికలను రూపొందిస్తున్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి



ఊట్కూరు ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో అధికారులతో మాట్లాడుతున్న శేఖర్‌రెడ్డి

నిడమనూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేసి, కాంటాలు వేసిన ధాన్యం ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి కేంద్రం నిర్వాహకులను ఆదేశించారు. మండలంలోని ఊట్కూరులో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన గురువారం సందర్శించి కొనుగోళ్లను పరిశీలించారు. వర్షాలు కురిసే ప్రమాదం ఉందని, కేంద్రానికి వస్తున్న ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయాలని సూచించారు. సిబ్బంది కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోళ్లు చేపట్టాలన్నారు. రైతులు పండించిన ధాన్యానికి కనీస మద్దతు ధర అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతి సీజన్‌లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి ధాన్యాన్ని కొంటుందన్నారు. రైతులు నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి కనీస మద్దతు ధర పొందాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో బోనగిరి రమేష్, ఏపీఎం లక్ష్మీనారాయణ, ఏఈవో మహేష్ పాల్గొన్నారు.

అంగన్‌వా'డీలా'

» భానుడి భగభగ.. చిన్నారులు విలవిల » ఉక్కపోతతో తల్లడిల్లుతున్న చిన్నారులు



మిర్యాలగూడలోని గాంధీనగర్‌లో రేకులగదిలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

అరకొర సౌకర్యాల నడుమ అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతు న్నాయి. ఇరుకు గదుల్లో అసౌకర్యాల నడమ నిర్వాహకులు కాలం వెళ్ల దీస్తున్నారు. రోజురోజుకు ఎండవేడి మి పెరుగుతుండటంతో చిన్నారులు ఉక్కపోతతో ఇబ్బందిని ఎదుర్కొం టున్నారు. అద్దె చెల్లింపు స్వల్పంగా ఉండటంతో పట్టణాల్లో సౌకర్యాలు ఉండే గదులు లభించడం లేదు. దీంతో చిన్నపాటి గదుల్లోనే కేంద్రాల నిర్వహణ జరుగుతోంది. దీంతో చిన్నారులు ఎండవేడిమికి డీలాపడి పోతున్నారు.

ఆంధ్రజ్యోతి విజిట్

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ అర్బన్)
రోజురోజుకూ ఎండవేడిమికి పెద్దలు తల్లిడిపోతుంటే చిన్నారులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ప్రధానంగా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే కిశోర బాలబాలికలు ఇరుకు గదుల్లో ఇబ్బందిపడుతున్నారు. పౌష్టికాహార తయారీకోసం గ్యాస్ బండ మంట తోడై గదులు వేడెక్కుతున్నాయి. ఈ పరిస్థితి ప్రధానంగా అద్దెభవనాల్లో కొనసాగుతున్న కేంద్రాల్లో ఎక్కువగా కనిపిస్తోంది. మౌలిక సదుపాయాల కల్పనలో ప్రజా ప్రతినిధులు, పాలకులు శీతకన్ను ప్రదర్శిస్తున్న నేపథ్యంలో చిన్నారులకు అగచాట్లు తప్పడంలేదు. గదుల్లో ఫ్యాన్లు సరిగ్గా పనిచేయడంలేదు. గాలి, వెలుతురు కరువయ్యాయి.

ఒక్క వేములపల్లి మండలంలోనే పక్కాగా...

మిర్యాలగూడ ప్రాజెక్టుపరిధిలో 462అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. మిర్యాలగూడ, మిర్యాలగూడ అర్బన్ ప్రాజెక్టుల పరిధిలో 119 కేంద్రాలు మాత్రమే పక్కా భవనాల్లో కొనసాగుతుండగా, 189కేంద్రాలను అద్దెభవనాల్లో నడిపిస్తున్నారు. మరో 154కేంద్రాలు ఉచిత భవనాల్లో పనిచేస్తున్నాయి. మిర్యాలగూడ ప్రాజెక్టు పరిధిలోని వేములపల్లి మండలంలో పూర్తిస్థాయిలో అంగన్‌వాడీ కేంద్రాలు పక్కా భవనాల్లో కొనసాగుతున్నాయి. మాడ్గులపల్లి, దామరచర్ల, మిర్యాలగూడ రూరల్, అర్బన్, అడవిదేవులపల్లి, త్రిపురారం మండలాల పరిధిలో అద్దె భవనాల్లో కేంద్రాలు పనిచేస్తున్నాయి. కొన్ని కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో చీకటిగదుల్లో తీవ్ర అసౌకర్య పరిస్థితుల నడుమ చిన్నారులు కాలం వెళ్లదీస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు 14,587మంది కిశోర బాలబాలికలు పూర్వవిద్యాభ్యాసం చేస్తుండగా సిబ్బంది కొరత వెంటాడుతోంది. ప్రాజెక్టు పరిధిలో 176 పోస్టులు ఖాళీగాఉన్నాయి. అందులో 26 కేంద్రాల్లో టీచర్ల కొరత ఉండగా, 150 ఆయా పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. సిబ్బంది కొరత కారణంగా చిన్నారుల ఆలనాపాలన గాడి తప్పి అస్తవ్యస్తంగా తయారవుతోంది. సిబ్బంది కొరత ఏర్పడిన కేంద్రాలను సమీప కేంద్రాల్లో విలీనం చేయడంతో చిన్నారుల సంఖ్య పెరిగి గదులు ఇరుకగా మారుతున్నాయి.

ఉన్నతాధికారులకు నివేదించాం



మిర్యాలగూడ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కొరతపై ఉన్నతాధికారులకు నివేదిక అందించాం. పక్కాభవనాల కోసం అవసరమయ్యే నిధుల కోసం ప్రతిపాదనలను గతంలో అందజేసి, నిధుల మంజూరుకు ఎదురుచూస్తున్నాం. పౌష్టికాహారాన్ని పూర్తిస్థాయిలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేస్తున్నాం. కరెంటు సదుపాయంలేని కేంద్రాలకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి కరెంట్ సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తాం.
- చంద్రకళ (సీడీపీవో, మిర్యాలగూడ)

సూర్యాపేట జిల్లాలోనూ..

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట టౌన్)
సూర్యాపేట జిల్లాలో మొత్తం 1,209 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. అందులో 347 కేంద్రాల్లో అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నారు. ఇరుకు గదులు, అసౌకర్యాల మధ్య కేంద్రాల్లో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. వేసవికాలం కావడంతో చిన్నారులకు ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లా వ్యాప్తంగా ఐసీడీఎస్ పరిధిలోని కేంద్రాల్లో 43,962 మంది చిన్నారులు వస్తున్నారు. గర్భిణులు 5,799, బాలింతలు 5,005 మందికి పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు.

నకిరేకల్ నియోజకవర్గంలో..

(ఆంధ్రజ్యోతి-నార్కట్‌పల్లి)
అంగన్‌వాడీ కేంద్రాల్లో ఫ్యాన్లు ఉన్నా కొన్నిచోట్ల మరమ్మతులకు గురయ్యాయి. ముఖ్యంగా అద్దె భవనాల్లో కొనసాగిస్తున్న కేంద్రాల్లో అరకొర వసతులు మధ్య నిర్వహణ కొనసాగుతోంది. మినీ అంగన్‌వాడీలను ప్రభుత్వం గతేడాది అంగన్‌వాడీలుగా గుర్తించింది. అయితే మినీ అంగన్‌వాడీలుగా కొనసాగిన భవనాల్లోనే అంగన్‌వాడీ కేంద్రాలుగా నిర్వహిస్తున్నారు. వీటిలో చాలావరకు గ్రామీణ ప్రాంతాల్లోని రేకుల గదుల్లో కొనసాగుతుండటంతో వేసవి తాపానికి చిన్నపిల్లలు ఇబ్బంది పడుతున్నారు. నకిరేకల్ నియోజకవర్గంలో 317 అంగన్‌వాడీ కేంద్రాలుండగా, వీటిలో 89 కేంద్రాలకే సొంత భవనాలున్నాయి. 163 కేంద్రాలను పలు ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల భవనాల్లో ఉచిత అద్దె కింద నిర్వహిస్తున్నారు. మిగతా 65 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. నియోజకవర్గవ్యాప్తంగా గర్భిణులు 1,564 మంది, 1,335 మంది బాలింతలు ఉన్నారు. ఆయా కేంద్రాల్లో 6నెలల వయసులోపు చిన్నారులు 1,280, ఏడాది వయసులోపున్న చిన్నారులు 1,326, మూడేళ్ల వయసున్న పిల్లలు 6,950, ఆరేళ్లలోపు చిన్నారులు 5,032 మంది ఉన్నట్లు తెలుస్తోంది.


చిట్యాలలోని అంగన్‌వాడీ కేంద్రం

ఉక్కపోతలోనే...

(ఆంధ్రజ్యోతి-దేవరకొండ)
దేవరకొండ డివిజన్‌లో అంగన్‌వాడీ కేంద్రాలు కొన్ని పక్కా భవనాల్లో, మరికొన్ని అద్దె భవనాలలో, రేకులషెడ్డులలో కొనసాగుతున్నాయి. రేకులషెడ్డులో ఎండవేడిమికి చిన్నారులు ఉక్కపోతకు గురై ఇబ్బందులుపడుతున్నారు. కొండమల్లేపల్లి మండలకేంద్రంలోని ఆరు కేంద్రాలు అద్దె భవనంలోనే కొనసాగుతున్నాయి. దేవరకొండ రోడ్డులోని 2వ అంగన్‌వాడీ కేంద్రంలో 14 మంది చిన్నారులతో రేకులషెడ్డులో కేంద్రం కొనసాగుతోంది. వేసవికాలం కావడంతో ఉక్కపోతతో చిన్నారులు ఇబ్బందిపడుతున్నారు. దేవరకొండ ఐసీడీఎస్ పరిధిలో 284 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా వాటిలో 5,985 మంది చిన్నారులు విద్యనభ్యసిస్తున్నారు.


కొండమల్లేపల్లిలో రేకులషెడ్డు అద్దె భవనంలో కొనసాగుతున్న 2వ అంగన్‌వాడీ కేంద్రం

అసౌకర్యాల నడుమ


చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పుతున్న అంగన్‌వాడీ టీచర్ భాగ్య

(ఆంధ్రజ్యోతి-భువనగిరిరూరల్): యాదాద్రి భువనగిరి జిల్లాలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలు సక్రమంగా నిర్వహిస్తున్నా మరికొన్ని నిర్వాహకుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. పలుచోట్ల అంగన్‌వాడీ కేంద్రాల్లో సౌకర్యాలు లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. భువనగిరి, యాదగిరిగుట్ట, ఆలేరు, చౌటుప్పల్, పోచంపల్లి మోత్కూరు మునిసిపాలిటీలలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అందజేసే అద్దె నెలకు రూ.2 వేల నుంచి రూ.4 వేలు యజమానులు గిట్టుబాటు కాక అద్దెకు ఇచ్చేందుకు వెనుకాడుతున్నారు. దీనికితోడు 4 నెలల నుంచి 6నెలలకు ఒకసారి అద్దెచెల్లింపులు జరుగుతుండటంతో అద్దెకు ఇచ్చేందుకు ఇష్టపడటం లేదు. వెరసి దొరికిన ఇరుకు గదుల్లోనే అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ కొనసాగుతోంది. ఈ విషయమై ఐసీడీఎస్ అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేదు.

నిబంధనల మేరకు అద్దె చెల్లింపు



ప్రభుత్వ నిబంధనల మేరకు మునిసిపాలిటీ పరిధిలో రూ.2 వేల నుంచి రూ.4వేల వరకు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1000 అద్దె చెల్లిస్తున్నాం. పట్టణాల్లో తక్కువ అద్దెకు ఇల్లు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారు. అయినప్పటికీ అర్బన్ ప్రాంతాల్లో అన్నివసతులతో కేంద్రాల నిర్వహణ చేపడుతున్నాం. వారంలో ఒకసారి తనిఖీలు చేపడుతున్నాం. పౌష్టికాహారం పంపిణీ, విధుల నిర్వహణ తదితర అంశాలపై ఆరా తీస్తున్నాం. పిల్లల తల్లిదండ్రులతో కూడా కేంద్రాల్లో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నాం.
- శైలజ , సీడీపీవో భువనగిరి ప్రాజెక్టు

యాదాద్రి జిల్లాలో ..

ఐసీడీఎస్ పరిధిలోని ప్రాజెక్టులు : భువనగిరి, రామన్నపేట, మోత్కూరు, ఆలేరు.
ఎన్ని కేంద్రాలు : 901
సొంత భవనాలు ఎన్ని : 269
అద్దె భవనాలు ఎన్ని : 328
రెంట్ ఫ్రీ భవనాలు:304 (కమ్యూనిటీ హాల్స్‌స్కూల్‌బిల్డింగ్స్, ఓల్డ్ జీపీ భవనాలు)
పట్టణ ప్రాంతాల్లో చెల్లిస్తున్న నెలసరి అద్దె : రూ.2 వేల నుంచి రూ.4వేలు
గ్రామీణ ప్రాంతాల్లో అద్దె : రూ.1000
ఆయా కేంద్రాల్లో 6నెలల్లోపు చిన్నారులు : 4,145
6 నెలల నుంచి మూడేళ్లలోపు చిన్నారులు : 21,138
3నుంచి 6 ఏళ్లలోపు వారు : 12,181
గర్భిణులు : 3,742
బాలింతలు : 4,145

కిమ్స్‌లో గ్రహణం మొర్రికి ఉచిత శస్త్రచికిత్సలు



గ్రహణం మొర్రి ఉచిత శస్త్రచికిత్సల క్లాప్ కార్యక్రమ వివరాలు చెబుతున్న ప్రిన్సిపాల్ మహేశ్

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : గ్రహణం మొర్రికి తమ ఆసుపత్రిలో ఉచితంగా అత్యాధునిక శస్త్రచికిత్సలు చేయనున్నట్లు నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లిలోని కామినేని దంత వైద్య, విద్య కళాశాల ప్రిన్సిపాల్ పీ.మహేశ్, మార్కెటింగ్ విభాగాధిపతి సత్యనారాయణ తెలిపారు. క్లాప్స్(క్లిఫ్ట్ లిప్ అండ్ పాలెట్ సర్జరీస్) పేరిట ఉచిత వైద్యంతో పాటు ఔషధాలు అందజేస్తామన్నారు. గురువారం కళాశాలలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రపంచంలో ప్రతీ 10వేల మంది జనసాలలో ఇద్దరు లేదా ముగ్గురు గ్రహణం మొర్రి బారిన పడుతుంటే మన దేశంలో ప్రతీ 10వేల మంది జనసాలలో 8 మంది గ్రహణం మొర్రి బాధితులున్నారని తెలిపారు. వీరికి మూడు దశల్లో ఆపరేషన్లను చేయవచ్చని, కానీ ప్రాథమిక దశలోనే గుర్తించి శస్త్రచికిత్సలు చేయిస్తే ఆరోగ్యపరంగా మంచి ఫలితాలుంటాయన్నారు. మోతాదుకు మించి మద్యం సేవించడం, పొగ త్రాగే తండ్రుల ద్వారా బీ ఫొలేట్ లోపంతో గ్రహణం మొర్రి రావటానికి అవకాశముంటుందని తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఈ సమస్యకు చికిత్స చేయించుకోవాలంటే గరిష్ఠంగా రూ.50,000లు అవుతాయని కానీ తమ ఆసుపత్రిలో నిపుణులైన వైద్యులతో ఉచితంగా చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. సమావేశంలో పబ్లిక్ హెల్త్ డెంటిస్ట్ హెచ్‌వోడీ యశ్వంత్‌సాయి, పీఆర్‌వో కిరణ్ తదితరులు ఉన్నారు.

హుజూర్‌నగర్ కోర్టు ఏజీపీగా రేణుకాదేవి


రేణుకాదేవి

హుజూర్‌నగర్ , ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లోని రెండవ అదనపు జిల్లా కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా పట్టణానికి చెందిన శ్రీనివాసుల రేణుకాదేవి నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ప్రస్తుతం ఆమె సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏజీపీగా కొనసాగుతున్నారు. ఇక నుంచి రెండవ అదనపు జిల్లా కోర్టుకు కూడా ఏజీపీగా విధులు నిర్వహించనున్నారు. తదుపరి ఉత్తర్వులు జారీ చేసేంత వరకూ ఆమె విధులు నిర్వహించాలని కలెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆమె నియామకంపై న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు సాముల రామిరెడ్డి, నారపరాజు శ్రీనివాసరావు, కాలువ శ్రీనివాసరావు, జక్కుల నాగేశ్వరరావు, నట్టి సత్యనారాయణ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.




నల్లగొండలో గురువారం ఉదయం లేతబంగారు వర్ణంలోని సూర్యుడితో పసుపువర్ణమైన ఆకాశం

హారికను ఆదుకుంటాం

● వైద్యసేవలు, ప్రభుత్వసాయంపై పరిశీలించండి
● ట్విట్టర్ వేదికగా అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు

నాగార్జునసాగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లో రెండేళ్ల కిందట పిచ్చికుక్కల దాడిలో గాయపడి అచేతనస్థితికి చేరిన బాలిక హారికను ఆదుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. మంత్రి దామోదర రాజనర్సింహ ద్వారా బాలిక విషయం తెలుసుకున్న సీఎం గురువారం హారికకు వైద్యసేవలు అందించడంతో పాటు ప్రభుత్వపరంగా అన్నివిధాలా ఆదుకోవాలని ట్విట్టర్(ఎక్స్) వేదికగా అధికారులను ఆదేశించారు. చిన్నారి తాత కొమ్ము రాందాసు, తల్లి సిద్వంతి తెలిపిన వివరాల ప్రకారం సిద్వంతి భర్త రెండున్నర ఏళ్ల కిందట మృతి చెందడంతో ఇద్దరు కుమార్తెలతో కలిసి సాగర్‌లో తల్లిగారింట్లోనే ఉంటోంది. రెండేళ్ల క్రితం చిన్నకుమార్తె హారిక(7) ఇంటి ముందు ఆటుకుంటుండగా పిచ్చికుక్కలు దాడిచేశాయి. రోడ్డుపై కొంతదూరం లాక్కెళ్లాయి. చిన్నారిని వెంటనే స్థానిక కమలానెహ్రూ ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లగా రెండు డోసుల కుక్కకాటు ఇంజక్షన్లు వేశారు. మూడో డోసు వేసే సమయంలో తీవ్ర జ్వరంతో ఆ చిన్నారి బాధపడుతోంది. జ్వరం ఎంతకి తగ్గకపోవడంతో హారికను హైదరాబాద్ ఫీవర్ ఆసుపత్రికి చికిత్స కోసం తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతుండగానే కాళ్లు, చేతులు స్పర్శను కోల్పోయాయి. దీంతో అక్కడి నుంచి నీలోఫర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా కోమాలోకి వెళ్లింది. 18 నెలల పాటు కోమాలో ఉన్న హారికను నల్లగొండ, హైదరాబాద్‌లోని పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో దాతల సహకారంతో వైద్యం చేయించారు. దీంతో కోమాలో నుంచి బయటకువచ్చింది. కానీ మాటలు రావడం లేదని తల్లి సిద్వంతి తెలిపింది. అమ్మా అని కూడా పిలవలేని స్థితిలో ఉందని ఆవేదన వ్యక్తం చేసింది. దీంతో తన కుమార్తెను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని వివిధ దినపత్రికల ద్వారా వేడుకుంది. పత్రికల కథనాల ద్వారా విషయం మంత్రి దామోదార రాజనర్సింహ దృష్టికి వెళ్లింది. దీంతో ఆయన స్పందించి చిన్నారికి మెరుగైన వైద్యం అందిచాలని నిమ్స్ డైరెక్టర్ బీరప్పను ఆదేశించారు. అంతే కాకుండా నల్లగొండ జిల్లా కలెక్టర్‌కు చిన్నారి ఆరోగ్య పరిస్థితిపై నివేదిక ఇవ్వాలని సూచించారు. దీంతో బుధవారం మునిసిపల్ సిబ్బంది చిన్నారి ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిపై నివేదిక తయారుచేసి వైద్య, ఆరోగ్య శాఖకు పంపించారు. హారిక పరిస్థితిని మంత్రి సీఎం రేవంత్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన హారిక పరిస్థితిపై ఆరా తీశారు. అంతే కాకుండా బాలికకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో ఆ కుటుంబాన్ని ఆదుకోవడానికి ఉన్న అన్ని అవకాశాలను పరిశీలించాల్సిందిగా అధికారులను సీఎం గురువారం ట్విట్టర్ వేదికగా ఆదేశించారు.


చిన్నారి వివరాలను సేకరిస్తున్న ఆరోగ్య మిత్ర, ట్విట్టర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ట్విట్



సీఎంకు రుణపడి ఉంటాం

మా పాపకు మెరుగైన వైద్యసేవలు అందించడంతో పాటు, తమ కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి ట్విట్టర్‌లో తెలిపారు. ఇందుకు సీఎంకు రుణపడి ఉంటాం.
సిద్వంతి, చిన్నారి తల్లి

నేడు నిమ్స్‌కు తీసుకెళ్తాం

నేడు(శుక్రవారం) హారికను హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్తాం. మంత్రి రాజనర్సింహ ఆదేశాలతో హైదరాబాద్‌కు తీసుకెళ్తున్నాం. ఇంటికి వచ్చిన ఆరోగ్యమిత్రకు చిన్నారికి ఆరోగ్యశ్రీ కార్డు కూడా లేదని తెలిపాం.
రాందాసు, హారిక తాత

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	515
టీఎంసీలు	140.3150
ఎడమకాల్వకు నీటి విడుదల	నిల్
కుడికాల్వకు	నిల్
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
క్రస్ట్ గేట్ల ద్వారా	నిల్
ఎస్ఎల్‌బీసీ ద్వారా	1,350 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్‌ఫ్లో	1,350 క్యూసెక్కులు

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	34.10 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	500 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	4000 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	627.30 అడుగులు
టీఎంసీలు	1.07
కాల్వలకు విడుదల	నిల్
ఇన్‌ఫ్లో	313.77 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	58.67 క్యూసెక్కులు

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి దివ్యక్షేత్రంలో గురువారం నిత్యకైంకర్యాలు పాంచరాత్రగమశాస్త్ర రీతిలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయ నైరుతి దిశలో అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు, వజ్రవైఢూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకులు గజవాహన సేవలో తీర్చిదిద్ది మంగళవాయిద్యాల నడుమ సేవోత్సవం చేపట్టారు. ఉత్సవమూర్తులను కల్యాణ మండపంలో అధిష్ఠింపజేసి, విష్వక్సేనుడి తొలిపూజలతో కల్యాణతంతు కొనసాగింది. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు స్వామివారి శేషవస్త్రాలు, ఆశీర్వచనం అందజేశారు. ముందుగా సుదర్శన శతకపఠనంతో హోమ పూజలు నిర్వహించారు. ప్రభాతవేళ గర్భాలయంలో స్వామిఅమ్మవార్లను సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చకస్వాములు నిజాభిషేకం, నిత్యార్చనలు చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో నిత్యపూజలు కొనసాగాయి. కొండపైన శివాలయంలో రామలింగేశ్వరస్వామికి నిత్యపూజలు, యాగశాలలో నిత్య రుద్రహవనం నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.13,20,094 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు.


ప్రాకార మండపంలో నిత్యకల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

మట్టపల్లిలో నిత్య కల్యాణం

మఠంపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం మట్టపల్లిలోని శ్రీలక్ష్మీనృసింహుడి క్షేత్రంలో గురువారం నిత్యకల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అదేవిధంగా ఆలయ సంప్రదాయ ప్రకారం ఆర్జిత కైంకర్యాలు జరిగాయి. కల్యాణం అనంతరం దివ్యమూర్తులకు గరుడోత్సవం నిర్వహించారు. అనంతరం దేవతమూర్తులను ఆలయ ప్రవేశం చేయించారు. మధ్యాహ్నం అమ్మవారికి కుంకుమార్చన, విశేషపర్వాలు కొనసాగాయి. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ చెన్నూరి మట్టపల్లిరావు, ఈవో సిరికొండ నవీన్, అర్చకులు, ఉద్యోగుల పాల్గొన్నారు.

శిలువపై క్రీస్తు శాంతి సందేశం

నేడు గుడ్ ఫ్రైడే


(ఆంధ్రజ్యోతి-నల్లగొండ కల్చరల్)
ఏసుక్రీస్తును శిలువ వేసిన రోజును క్రైస్తవులు గుడ్‌ఫ్రైడేగా నిర్వహిస్తారు. తిరిగి లేచిన మూడో రోజున ఈస్టర్ పండుగను జరుపుతారు. క్రైస్తవులకు ఇది అతి ముఖ్యమైన పండుగ. ఈ ఏడాది మార్చి 8వ తేదీ నుంచి మొదలుకుని ఈ నెల 18వ తేదీ వరకు 40 రోజుల పాటు క్రైస్తవులు ఉపవాస దీక్షలు చేపట్టారు. గుడ్ ఫ్రైడే రోజు వరకు క్రైస్తవులు ఉపవాసాలు ఉండి భక్తిశ్రద్ధలతో ప్రతి రోజూ దైవ ప్రార్థనలు చేస్తారు. ఏసుక్రీస్తు జననం, మరణం, పునరుత్థానం ఘటనలు అసాధరణంగా వారు భావిస్తారు. ఏసుక్రీస్తు శిలువపై పడిన కష్టాలు, పలికిన ఏడు మాటలు ప్రపంచ మానవాళికి ప్రేమ మార్గాన్ని చూపుతాయని భక్తుల విశ్వాసం.

అందువల్ల ఆయన చనిపోయిన రోజును ప్రపంచవ్యాప్తంగా మంచి శుక్రవారం(గుడ్‌ఫ్రైడే)గా జరుపుకుంటారు. ఈ నెల 18వ తేదీన నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఉన్న చర్చిల్లో గుడ్ ఫ్రైడే వేడుకలు జరగనున్నాయి. అందుకు చర్చీలు ముస్తాబయ్యాయి.



పులిచింతలలో జలవిద్యుత్

పునఃప్రారంభం



మేళ్లచెర్వు ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట ఉభయరాష్ట్రాల సరిహద్దులోని పులిచింతల ప్రాజెక్టులో గురువారం జలవిద్యుదుత్పత్తి ప్రారంభమైంది. ప్రాజెక్టు దిగువ భాగాన నీటి అవసరాల కోసం తెలంగాణ పవర్ హౌస్ నుంచి 4 వేల క్యూసెక్కులను వినియోగిస్తూ ఒక్క యూనిట్ ద్వారా 26 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175 (45.77 క్యూసెక్కులు) అడుగులు కాగా గురువారం సాయంత్రానికి 166.89 (34.10టీఎంసీలు) అడుగులుగా నమోదైంది. ప్రాజెక్టుకు 500 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వస్తుండగా, విద్యుదుత్పత్తి కేంద్రం నుంచి 4 వేల క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు గేట్లు మూసివేసి ఉంచారు.

నిజాయితీ చాటుకున్న డ్రైవర్

వలిగొండ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) : ప్రయాణికుడు పోగొట్టుకున్న 25 తులాల బంగారం బ్యాగ్‌ను బాధితుడికి అప్పగించి ఓ ప్రైవేట్ డ్రైవర్. నిజాయితీని చాటుకున్నాడు యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం లింగరాజుపల్లి గ్రామానికి చెందిన లాగ్గొని వెంకటేష్ గౌడ్ తుపాన్ వాహనం కిరాయి నడుపుతుంటాడు. ఈ క్రమంలో గురువారం ఇదే మండలం ఎదుళ్లగూడేనికి చెందిన మునికుంట్ల వెంకులు ఓ శుభకార్యం నిమిత్తం రంగారెడ్డి జిల్లా కీసరకు తుపాన్ వాహనం కిరాయి తీసుకొని బంధువులతో కలిసి వెళ్లి వచ్చాడు. అయితే వెంకులు వాహనంలో 25 తులాల బంగారు ఆభరణం, సెల్‌ఫోన్, గుర్తింపు కార్డులు కలిగిన బ్యాగు మరిచిపోయాడు. బ్యాగును గుర్తించిన డ్రైవర్ వెంకులుకు అప్పజెప్పి నిజాయితీని చాటుకున్నాడు.

మరో ఘటనలో మంగళసూత్రం అందజేసిన మహిళ



పుస్తెలతాడును లక్ష్మమ్మకు అందజేస్తున్న అనిత

చిట్యాలరూరల్: నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు గ్రామ పరిధిలోని సుర్కంటిగూడేనికి చెందిన సుర్కంటి లక్ష్మమ్మ వెలిమినేడు శివారులోని కొనుగోలు కేంద్రంలో ఈనెల15న ధాన్యాన్ని ఆరబెట్టడానికి వెళ్లింది. ధాన్యం ఆరబెడుతున్న క్రమంలో మంగళసూత్రం పోగట్టుకుంది. అనంతరం మధ్యాహ్నం తన బావి వద్దకు వెళ్లి చూసుకోగా మెడలోని 4 తులాల మంగళసూత్రం కనబడక పోవడంతో బావి వద్ద, ఇల్లంతా వెతికింది. అయినా లభించలేదు. స్థానికంగా వాకబు చేసినా ఫలితం లేక పోయింది. అదే రోజు కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని ఆరబెట్టేందుకు వెళ్లిన అదే గ్రామానికి చెందిన మిర్యాల అనితకు మంగళసూత్రం దొరికింది. అక్కడ ఎవరూ కనబడకపోవడంతో ఇంటికి వచ్చింది. వ్యక్తిగత పనిమీద వేరే గ్రామానికి వెళ్లిన అనిత గురువారం గ్రామానికి వచ్చింది. విషయం తెలుసుకున్న అనిత గురువారం రాత్రి అనిత ఇంటికి వెళ్లిన లక్ష్మమ్మకు మంగళసూత్రాన్ని అందజేసింది. దీంతో లక్ష్మమ్మ అనితకు కృతజ్ఞతలు తెలిపింది.

రైస్‌మిల్‌లో విజిలెన్స్ బృందం తనిఖీ

చింతపల్లి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలోని నసర్లపల్లిలోని వెంకటసాయి రైస్‌మిల్‌లో హైదరాబాద్‌కు చెందిన విజిలెన్స్ బృందం గురువారం తనిఖీ చేసింది. పౌర సరఫరాల శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు విస్తృతంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించింది. ఈ సందర్భంగా పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలుతో పాటు నిల్వల్లో మోసాలకు పాల్పడితే చర్యలు తీసు కుంటా మన్నారు. వ్యాపారులు మోసానికి పాల్పడితే కేసు నమోదు చేస్తామని హెచ్చ రిం చారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రికార్డుల్లో వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఈ తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్ వెంకటేష్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఐదుగురు మృతి

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో గురువారం జరిగిన వేర్వేరు ఘటనల్లో ఐదుగురు మృతి చెందారు. రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మరణించగా, మరో ఇద్దరు ఆత్మహత్య చేసుకోగా యువకుడు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే..

కేతేపల్లి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేతేపల్లి 65వ నంబరు జాతీయ రహదారిని రోడ్డు దాటుతున్న మహిళను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై చికిత్స పొందుతూ మృతి చెందింది. కేతేపల్లి ఎస్ఐ ఎ.శివతేజగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రిభువనగిరి జిల్లా మోటకొండూరు గ్రామానికి చెందిన బందనాథం అరుణ పుట్టిల్లు కేతేపల్లి మండలం ఇనుపాముల ఆవాస గ్రామం రాయపురం. కేతేపల్లిలోని ప్రభుత్వ కార్యాలయంలో పని నిమిత్తం ఇక్కడకు వచ్చిన అరుణ స్థానిక ఎస్సీ కాలనీ వద్ద ఆటో దిగి అక్కడ గల జంక్షన్‌లో హైవేను దాటుతున్న క్రమంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపునకు వెళ్తున్న గుర్తు తెలియని లారీ ఢీకొట్టి వెళ్లింది. ఈ ప్రమాదంలో అరుణ తలకు, కడుపులో బలమైన గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108సిబ్బంది ఆమెను సూర్యాపేట జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న అరుణ మరణించినట్లు ఎస్ఐ వివరించారు. మృతురాలి కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదు తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

మిర్యాలగూడలో వృద్ధుడు..

మిర్యాలగూడ అర్బన్ : నల్లగొండజిల్లా మిర్యాలగూడ పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి స్థానిక ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక బంగారు గడ్డకాలనీకి చెందిన గుంటి ఆదినారాయణ(65) స్కూటీపై రోడ్డుపై వెళ్తుండగా ఓ ద్విచక్ర వాహనం ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఆదినారాయణ తలకు తీవ్ర గాయాలు కావడంతో ఏరియా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. మృతుడి మేనల్లుడు చిలుకూరి బాలు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ మోతీరాం తెలిపారు.

కాగా మృతుడు ఆదినారాయణ నేత్రాలను దానం చేసేందుకు కుటుంబసభ్యులు అంగీకరించడంతో డైమండ్ నేత్రనిధి ప్రతినిధులు ఆదినారాయణ నేత్రాలను సేకరించారు. దీంతో మరో ఇద్దరు అంధులకు కంటిచూపునిచ్చేందుకు ఆదినారాయణ నేత్రాలు ఉపకరిస్తాయని నేత్రనిధి ప్రతినిధులు తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడు..

సంస్థాన్ నారాయణపురం : యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం చిమిర్యాల గ్రామంలో విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందాడు. గ్రామానికి చెందిన కొల్లూరి పవన్ కుమార్ (19) ప్లంబర్. కుర్మకొత్తగూడెం గ్రామంలో ఓ ఇంటికి ప్లంబర్ పని చేయడానికి మరో వ్యక్తితో కలిసి గురువారం వెళ్లాడు. వాటర్ పైప్ వేయడానికి డ్రిల్లింగ్ మిషన్‌తో గోడకు డ్రిల్ చేస్తుండగా విద్యుత్ బోర్డుకు డ్రిల్లింగ్ మిషన్‌కు ఉన్న ప్లగ్ ఊడి కిందపడింది. అప్పటికే ఇంటి గోడలకు నీళ్లు కొట్టడంతో కింద నీళ్లు నిలిచాయి. ఊడిన ప్లగ్ అందులో పడడంతో పవన్‌కుమార్‌కు విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి నర్సింహ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



పవన్‌కుమార్(ఫైల్)

నిప్పంటించుకుని బాలిక ..

బీబీనగర్ : మానసిక స్థితి బాగా లేని ఓ మైనర్ ఒంటికి నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన యాదాద్రి భువ నగిరి జిల్లా బీబీనగర్ మండలం రుద్రవెల్లి గ్రామంలో గురువారం జరిగింది. సీఐ ప్రభాకర్‌రెడ్డి, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రవెల్లి గ్రామానికి చెందిన దండ్రు నర్సింహ నిర్మల దంపతులకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. వీరిలో చిన్న కూతురు దండ్రు దీపిక (17) కొంతకాలంగా మానసిక పరిస్థితి సరిగా లేకపోవడంతో అప్పుడప్పుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడేది. కుటుంబ సభ్యుల జాగ్రత్తతో ప్రాణా పాయంతో బయటపడేది. అయితే గురువారం ఉదయం దీపిక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లో బండిలో నుంచి పెట్రోల్ తీసి నిప్పంటించుకుంది. దీంతో తీవ్ర కాలిన గాయాలతో అపస్మారక స్థితికి చేరుకోవడంతో కుటుంబ సభ్యులు భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందినట్లు సీఐ తెలిపారు.

మానసిక వేదనతో ప్రభుత్వ ఉద్యోగి ..



తిరుమలగిరి(సాగర్) : తన తల్లి మృతిచెందడంతో కొద్దికాలంగా మానసిక వేదనకు గురై ప్రభుత్వ ఉద్యోగి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్)మండలం కొంపెల్లి గ్రామంలో బుధవారం ఘటన జరుగగా గురువారం వెలుగులోకి వచ్చింది. కొంపెల్లి గ్రామానికి చెందిన చిత్రం కొండల్(35)యాదాద్రి భువనగిరిజిల్లా కలెక్టరేట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. 9 నెలల క్రితం కొండల్ తల్లి ఈదమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. అప్పటి నుంచి కొండల్ మానసికంగా ఇబ్బందులు పడుతున్నాడు. నాలుగు రోజుల క్రితం సెలవుపై ఇంటికి వచ్చిన కొండల్ ఇంట్లోనే ఉంటున్నాడు. బుధవారం ఉదయం తండ్రి చినమల్లయ్య గేదెలను మేపడానికి పొలానికి వెళ్లాడు. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరేసుకున్నాడు. సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా అప్పటికే మృతి చెందాడు. స్థానికుల సాయంతో కిందకు దింపి చూడగా పురుగుల మందు తాగి అనంతరం ఉరేసుకున్నట్లుగా గుర్తించారు. తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నాగార్జునసాగర్ కమలానెహ్రూ ఆసుపత్రికి తరలించారు. అనంతరం కుటుంబీకులకు మృతదేహాన్ని అప్పగించినట్లు ఎస్ఐ వీరశేఖర్ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

మఠంపల్లి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మఠంపల్లి మండలం చౌటపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కనిపించడం లేదని పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నల్లబోతుల కోటయ్య(56)ఈనెల 13న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. మూడు రోజులు గడుస్తున్నా తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో మఠంపల్లి స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఇసుక డంప్‌ల సీజ్



ఇసుక డంప్‌ను సీజ్ చేసిన అధికారులు

రాజాపేట, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పార్‌బాయిల్డ్ రైస్ మిల్లులో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌లను గురువారం తహసీల్దార్ అనిత సీజ్ చేశారు. సుమారు 240 ట్రిప్పుల ఇసుకను అనుమతులు లేకుండా నిల్వ చేశారని వారు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లకోసం ఇసుక అనుమతి తీసుకొని పక్కాదారి పట్టించారని పేర్కొన్నారు.

పొలంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మునగాల, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా మునగాల మండల కేంద్రం శివారులో పొలంలో గురువారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తూముల వీరస్వామి పొలాన్ని కోత మిషన్‌తో కోపిస్తుండగా దుర్వాసన వచ్చింది. దీంతో పరిసర ప్రాంతాలను పరిశీలించగా బురదలో ఓ వ్యక్తి మృత దేహం కనిపించింది. వెంటనే వీరస్వామి స్టేషన్‌కు సమాచారం అందించారు. హుటాహుటిన పోలీస్ సిబ్బందితో పొలం వద్దకు వెళ్లి పరిశీలించారు. సుమారు 40 ఏళ్లలోపు వయస్సు గల వ్యక్తిగా గుర్తించారు. బ్లూ కలర్ జీన్ పాయింట్, టీషర్ట్‌తో మృతదేహం కుళ్లిపోయివాసన వస్తున్నది. ఐదురోజుల క్రితం వచ్చిన గాలివానకు పొలంలో ఎల్‌టీ లైన్ విద్యుత్ వైర్లు తెగిపడి విద్యుదాఘాతంతో మృతి చెంది ఉండవచ్చని అని భావిస్తున్నారు. మృతుడి ఆచూకీ లభించలేదు. కుళ్లిన మృతదేహాన్ని సూర్యాపేట ఏరియా ఆస్పత్రి మార్చురీ గదిలో ఉంచారు. మృతుడి వివరాలు తెలిసిన వారు వెంటనే పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

బిర్యానీలో ఈగ.. రూ.5 వేల జరిమానా



జరిమానా విధిస్తున్న మునిసిపల్ అధికారులు

సూర్యాపేటటౌన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): హోటల్ యాజమాన్యాలు ప్రజల ఆరోగ్యాలతో చెలగాట మాడితే కఠిన చర్యలు తీసుకుంటా మని మునిసిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ హెచ్చరించారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని దురాజ్‌పల్లి వద్ద గల హంగ్రీ బర్డ్స్ బిర్యానీ సెంటర్‌లో బిర్యానిలో ఈగ వచ్చినట్లు కస్టమర్ ఫిర్యాదు చేశారు. దీంతో తనిఖీలు నిర్వహించి యాజమాన్యానికి రూ. 5000 జరిమానా విధించారు. హోటల్ నిర్వాహకులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సురేష్, ఎన్విరాల్‌మెంట్ ఇంజనీర్ సీహెచ్. శివప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల కూల్చివేతకు కలెక్టర్ ఆదేశాలు



సర్వే చేస్తున్న తహసీల్దార్, సర్వేయర్

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడాల కూల్చివేతకు రెవెన్యూ అధికారులు సత్వర చర్యలకు ఉపక్రమించారు. ఆక్రమణల ఫిర్యాదులు వచ్చిన నిర్మాణాలు జరిగిన స్థలంలో గురువారం సర్వే చేసి డీ మార్కేషన్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలో సర్వే నంబర్ 550లో సుమారు 106 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. వీటిలో సుమారు 100 ఎకరాల విస్తీర్ణం మేర పలు దఫాలుగా ప్రభుత్వం అసైన్డ్ కమిటీ నిర్ణయం మేరకు లబ్ధిదారులకు పట్టా లు పంపిణీ చేసింది. అయితే ఇదే సర్వే నంబర్‌లోని ప్రభుత్వం అసైన్డ్ చేయగా మిగిలిన కొంత భూమితో పాటు రామిడి గోపాల్ అనే ఓ పట్టాదారుడికి అసైన్డ్ చేసిన 15 గుంటల భూమిలో ఓ విత్తన కంపెనీ యాజమాన్యం భవనాలను నిర్మించింది. దీంతో రామిడి గోపాల్ గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించి విచారణకు కలెక్టర్ ఆదేశించగా ఇప్పటికే పలు దఫాలుగా జిల్లా సర్వే అధికారి (డీఐ), ఆర్‌డీవో, మండల రెవెన్యూ అధికారులు సంయుక్తంగా సర్వే చేశారు. సర్వే నివేదికను కలెక్టర్‌కు అందజేయగా బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఇలా త్రిపాఠి విచారణ నిర్వహించారు. ఫిర్యాదు ఎదుర్కొంటున్న నిర్మాణాలు గల భూమి ప్రభుత్వ భూమి కాదని కంపెనీ యాజమాన్యం నిరూపించలేకపోయింది. పైగా వసర్వేయర్ నివేదిక కూడా షెడ్డు నిర్మాణంలో సుమారు 15 నుంచి 19 గుంటల వరకు ప్రభుత్వ భూమి ఉన్నట్టు ప్రాథమికంగా నిర్ధారించే సర్వే నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. దీంతో ఆక్రమణలను 48 గంటల్లో కూల్చివేయాలని కలెక్టర్ ఆదేశించారు. దీంతో తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్‌రావు, సర్వేయర్ బీ.శ్రీనివాస్, ఆర్ఐ భవానీ గురువారం సంబంధిత కంపెనీ షెడ్డు నిర్మాణ స్థలాన్ని సర్వే చేసి ప్రభుత్వ భూమి ఉన్నంత వరకు డీ మార్కేషన్ చేశారు. ఆక్రమిత ప్రభుత్వ స్థలాన్ని 48 గంటల్లో ఖాళీ చేయాలని కంపెనీ యజమానికి నోటీసులు సిద్ధచేస్తున్నారు.

కాల్వల భూపరిహారం
నిధులూ మింగేశారు

● ఫోర్జరీ సంతకాలతో నిధులు కాజేసిన అధికారులు



ఏఎమ్మార్పీ డిస్ట్రిబ్యూటరీ 8,9కి అనుసంధానంగా నిర్మించిన 15 ఆర్ మైనర్ కాల్వ

ఏఎమ్మార్పీ డిస్ట్రిబ్యూటరీ కాల్వల నిర్మాణంలో భూనిర్వాసితులకు మంజూరైన నిధులను కొందరు అధికారులు కాజేశారు. సుంకిశాల- కోదండాపూర్ భూనిర్వాసితులకు చెల్లించాల్సిన నష్టపరిహారాన్ని ఫోర్జరీ సంతకాలతో దోచినట్లుగానే ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ 9, డిస్ట్రీబ్యూటరీ కాల్వ 8,9కి అనుసంధానంగా నిర్మించిన 15ఆర్ మైనర్ల నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు దక్కాల్సిన నిధులను స్వాహా చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. రెండు ప్రాజెక్టులకు సంబంధించి భూనిర్వాసితుల పరిహారాన్ని ఫోర్జరీ సంతకాలతో కాజేసిన వ్యవహారంలో ఓ రెవెన్యూ అధికారి కీలకపాత్ర వహించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. (ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ)

ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు(ఏఎమ్మార్పీ) ప్రధాన కాల్వ 9కి అనుసంధానంగా మైనర్ కాల్వలను నిర్మించడానికి 2007 అక్టోబరులో ప్రభుత్వం భూసేకరణ చేపట్టింది. డిస్ట్రిబ్యూటరీ 8,9 లకు పర్వేదుల వద్ద నుంచి నాటి చలకుర్తి గ్రామపంచాయతీ మల్లోరికుంట తండా వరకు సుమారు 2 కి.మీ మేర 15 ఆర్ మైనర్ కాల్వ ఏర్పాటు చేసేందుకు 44 మంది రైతుల నుంచి భూమిని సేకరించింది. ఇందుకు ఎకరానికి రూ.80 వేల చొప్పున పరిహారం ప్రకటించింది. భూనిర్వాసితులకు ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు పేరున ఏఎమ్మార్పీ యూనిట్ 11 నల్లగొండ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ల్యాండ్ అక్విజేషన్) చెక్కులను జారీ చేశారు. అయితే సంఘమిత్ర కో-ఆపరేటివ్ బ్యాంకు నల్లగొండలో లబ్ధిదారుల ఖాతాలు తెరిపించి ఏజెంట్ అవతారం ఎత్తిన అధికారి నిధులు డ్రాచేసి తన కమీషన్ కట్ చేసుకుని కొందరికీ పరిహారం అందజేయగా మరికొందరి లబ్ధిదారులకు తెలియకుండా ఫోర్జరీ సంతకాలతో లక్షలు కాజేసినట్లు సమాచారం.

ఆయనే కీలకం

భూపరిహారాన్ని నిర్వాసితులకు అందకుండా కాజేసినవారిలో ఓ పంచాయతీ అధికారే కీలకమని బాధితులు ఆరోపిస్తున్నారు. పర్వేదుల గ్రామానికి చెందిన అధికారి అనారోగ్యానికి గురై విధులు నిర్వహించలేని స్థితిలో ఆయన కుమారుడు అనాధికారికంగా అన్నిసర్టిఫికెట్లపై, రిజిష్టర్లలో తండ్రి సంతకాలు తానే ఫోర్జరీ చేస్తూ అక్రమాలకు తెర లేపినట్లు బాధితులు వాపోతున్నారు. అనతికాలంలో తండ్రి ఉద్యోగంలో నియమాకమై పదోన్నతి పొంది ప్రస్తుతం సొంత మండలంలోనే రెవెన్యూ శాఖలో అధికారిగా విధులు నిర్వహిస్తుండగా, చిన్న ఉద్యోగంతోనే కోట్లలో ఆస్తులను కూడబెట్టినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ఫోర్జరీ సంతకాలతో నిధులు కాజేశారు

నా భూమి 2 ఎకరాలు, మా సోదరుడి కుమారుడిది ఎకరం 10 గుంటలు మైనర్‌కాల్వ నిర్మాణంలో పోతుండడంతో ప్రభుత్వం పరిహారం కింద రూ.3.05 లక్షల పరిహారం ప్రకటించింది. మా కుటుంబం ఊర్లో లేని కాలంలో మా సంతకాలను ఫోర్జరీ చేసి పంచాయతీ అధికారి కాజేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశాను.

- మేరెడ్డి జైపాల్‌రెడ్డి, పెద్దవూర

కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నాం

పరిహారం నిధులు కాజేసిన విషయమై బాధితుల నుంచి ఫిర్యాదు అందింది. పెద్దవూర పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి విచారణ సాగిస్తున్నాం.

- శ్రీనునాయక్, సీఐ, నాగార్జునసాగర్

ఆరుగురు లబ్ధిదారులకు అందని పరిహారం

తమకు పరిహారం అందలేదని సంబంధిత భూనిర్వాసితులు నల్లగొండ సంఘమిత్ర సహకార బ్యాంకులో తమకు జారీ చేసినట్లు చెబుతున్న చెక్కుల గురించి వివరాలు అడిగితే బ్యాంకు అధికారులు ఏ సమాచారం ఇవ్వడం లేదని ఆరోపిస్తున్నారు. పర్వేదులకు చెం దిన మేరేడ్డి జైపాల్‌రెడ్డి(2 ఎకరాలు) అతని సోదరుడి కుమారుడు సాయిశరత్‌రెడ్డి(ఎకరం) స్థానికంగా లేనప్పటికీ అన్ని రికార్డుల్లో వారి సంతకాలను ఫోర్జరీ చేసి వారి పేరున 80, 91, 92, 93 గల 3 ఎకరాల10 గుంటల భూమి, అందులోని 127 బత్తాయి చెట్లుకు జైపాల్‌రెడ్డి ఒక్కరి పేరున రూ. 3,05,221 మంజూరు చేసినట్లు చూపి ఫోర్జరీ సంతకాలతో కాజేసినట్లు ఆరోపించారు. మరో 5గురికి లక్షల్లో అందాల్సిన పరిహారాన్ని మింగేసినట్లు అనుమానిస్తున్నారు. ఇందుకు సంబంధించి బ్యాంకు అధికారులను చెక్కుల డ్రా కు సంబంధించి సంబం ధిత లబ్ధిదారులు వివరాలు అడిగితే బ్యాంకు అధికారులు సాకులు చెబుతూ దాటవేస్తున్నారని అంటున్నారు.

ఓ మాట .. మహోద్యమానికి బాట



భూదాన్‌పోచంపల్లిలోని ఆచార్య వినోభాభావే వెదిరె రామచంద్రారెడి కాంస్య విగ్రహాలు


'దేశంలో భూమి కోసం ఎన్నో యుద్ధాలే జరిగిన సంఘటనలు ఉన్నాయి. కానీ, ఓ స్ఫూర్తివంతమైన వ్యక్తి చెప్పిన మాట మహోద్యమానికి దారి తీసింది. భూదానోద్యమానికి వెదిరె రామచంద్రారెడ్డి ముందడుగు వేస్తే.. ఈ నడక పలువురికి మేలు చేసేలా చేసింది. ఆచార్య వినోబా భావే. 1951 ఏప్రిల్ 18న దేశ చరిత్రలోనే భూమిని దాన రూపంగా ఇచ్చి భూదానోద్యమానికి నాంది పలి కిన పోచంపల్లి చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన ప్రాంతంగా చోటు చేసుకుంది. నేడు భూదానోద్యమ జయంతి వజ్రో త్సవాల సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం

భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) : గాంధీజీ ఆశయాలు, సర్వోదయ సిద్ధాంతాలను ప్రచారం కోసం ఆచార్య వినోబా భావే పౌనార్ ఆశ్రమాన్ని వీడి దేశమంతటా పాదయాత్ర చేయడానికి సిద్ధమయ్యారు. అదే సమయంలో సర్వోదయ నాయకుడు శ్రీ రామకృష్ణ దూత్ ఆహ్వానం మేరకు 1951 ఏప్రిల్ 15న హైదరాబాద్ సమీపంలో గల శివరాంపల్లిలో నిర్వహించే సర్వోదయ సమ్మేళనంలో తన సందేశాన్ని ఇవ్వడానికి వచ్చారు. అదే సమయంలో తెలంగాణ సాయుధ పోరాటం సాగుతున్న తరుణంలో నల్ల గొండ జిల్లాలజరుగుతున్న రజాకార్ల దోపిడీ, కల్లోల పరిస్థితులు తెలుసుకుని వెంటనే పాదయాత్రగా బయలుదేరి 17న ప్రస్తుత యాదాద్రి-భువనగిరి జిల్లాలోని పోచంపల్లికి వినోబాభావే చేరుకున్నారు. మరుసటి రోజు ఏప్రిల్ 18న హరిజనులతో ఆయన సమావేశమయ్యారు. దీంతో వారు తమ గోడును వెళ్ల బోసుకున్నారు. వినోబాభావే అందుకు స్పందిస్తూ.. మీలో ఎవరైనా భూమిని దానం చేసేవారున్నారా? అని ప్రశ్నించారు. అక్కడ జన సందోహం మధ్యలో ఉన్న వెదిరె రామచంద్రారెడ్డి లేచి తన తండ్రి జ్ఞాపకార్థం 100 ఎకరాల సేద్యయోగ్యమైన భూమిని దానం చేస్తానని ప్రకటించారు. అక్కడికక్కడే దాన పత్రాన్ని రాసి వినోబాభావేకు అందజేశారు. అలా లభించిన ఆ భూమిని వినోబాభావే పేదలకు పంచి భూదానోద్యమానికి బీజం వేశారు. వినోబాభావే పోచంపల్లికి వచ్చే వరకు భూదానోద్యమంపై ఆలోచన రాలేదు. యాదృచ్ఛికంగా భూదానోద్యమం ఒక స్పష్టమైన కార్యక్రమంగా రూపుదిద్దు కుంది. అప్పటి నుంచి దేశవ్యాప్తంగా దాదాపు 80వేల కిలోమీటర్ల పాదయాత్ర నిర్వహించి 1970 వరకు దాదాపు 44 లక్షల ఎకరాల భూమిని భూదానోద్యమంలో సేకరించారు. సుమారు 40లక్షల మందికి దానం చేశారు.

● భూదానోద్యమానికి నాంది పలికిన పోచంపల్లి

పోచంపల్లిలో మూడు సార్లు పర్యటన

ఆచార్య వినోబాభావే పోచంపల్లిలో మొత్తం మూడు సార్లు పర్యటించి తన పాదయాత్ర ద్వారా 1.70 లక్షల ఎకరాల భూమిని సేకరించారు. అలాగే రెండోసారి ఉమ్మడి రాష్ట్రంలోని శ్రీకాకుళం నుంచి 1955 డిసెంబర్‌లో పాదయాత్ర ప్రారంభించి 1956లో గాంధీ వర్ధంతి రోజున జనవరి 30న పోచంపల్లికి చేరుకున్నారు. సేకరించిన 1.70 లక్షల ఎకరాల్లో 1.26 లక్షల ఎకరాల భూమికి మాత్రమే చట్టబద్ధత కలిగి ఉంది. జిల్లాలో సైతం వేల ఎకరాల భూమిని భూమిలేని నిరుపేదలకు పంచిపెట్టారు. ఇలా భూదానోద్యమానికి అంకురార్పణ జరిగిన పోచంపల్లిని 'భూదాన గంగోత్రి'గా అభివర్ణిస్తూ ఆయన తన రెండో జన్మస్థలంగా పోచంపల్లిని పేర్కొన్నారు



వినోబాభావేకు దానపత్రం అందిస్తున్న వెదిరె రామచంద్రారెడ్డి (ఫైల్)

నేడు భూదాన్ జయంతి వజ్రోత్సవాలు



భూదాన్ జయంతి వజ్రోత్సవాలు శుక్రవారం భూదాన్‌పోచంపల్లిలో వినోబామందిరంలో ఘనంగా నిర్వహిస్తాం డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షులు డా.గున్న రాజేందర్‌రెడ్డి అధ్యక్షతన శాంతిహోమం, 'భూభారతి-భూదాన్ భూముల సమస్యలకు పరిష్కారం' అనే అంశంపై సెమినార్ నిర్వహిస్తాం. ఈ కార్యక్రమానికి భువనగిరి ఎపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి హాజరుకానున్నారు.

- యానాల ప్రభాకర్‌రెడ్డి, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ప్రారంభానికి నోచుకోని వినోబా మందిరం

భూదానోద్యమానికి నాంది పలికిన భూదాన్‌పోచంపల్లిలో స్మృతి చిహ్నంగా నిర్మించిన వినోబామందిరం నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. శిథిలమైనందున దశాబ్దకాలం క్రితం రూ.50లక్షలతో అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో భూదాన్‌పోచంపల్లి పట్టణంలో వినోబామందిరాన్ని పునర్నిర్మించారు. ఈ మందిరం నిర్వహణ కానీ, దాని ఆలనాపాలనా లేక ఎప్పుడూ తాళం వేసే కనిపిస్తోంది. అయితే వినోబామందిరం నిర్వహణ బాధ్యత రాష్ట్ర భూదాన్‌యజ్ఞ బోర్డు చైర్మన్ గున్న రాజేందర్‌రెడ్డి వ్యవహరిస్తున్నారు. తన సొంత నిధులతో ఈ భవనంలో గాంధీజీ, వినోబాభావేలకు సంబంధించిన సాహిత్యాన్ని, భూదానోద్యమ చారిత్రక ఘట్టాలను చాటే మ్యూజియం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రభుత్వం వినోబా మందిరం ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ప్రారంభానికి నోచుకోని భూదాన్‌పోచంపల్లిలోని వినోబామందిరం

నేడు పలివెలలో స్వాతంత్ర్య సమరయోధుల స్థూపావిష్కరణ

మునుగోడు రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మునుగోడు మండల పరిధిలోని పలివెల గ్రామంలో స్వాతంత్ర సమరయోధులు కొండవీటి బచ్చిరెడ్డి, కొండవీటి జగన్మోహన్‌రెడ్డి (జగాల్‌రెడ్డి)ల స్థూపాలను శుక్రవారం ఆవిష్కరించనున్నారు. కార్యక్రమానికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ప్రెస్ అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ సీతారాములుతో పాటు పలువురు పాల్గొననున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

నేటినుంచి గ్రామాల్లో గాలికుంటు వ్యాధి టీకాలు

శాలిగౌరారం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలంలో అన్ని గ్రామాల్లో నేటి నుంచి వచ్చే నెల 12వ తేదీ వరకు పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయనున్నట్లు మండల వెటర్నరీ డాక్టర్ శరణ్య తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. 18న శాలిగౌరారం, ఇటుకులపహాడ్ గ్రా మాల్లో గాలికుంటు వ్యాధి టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు శరణ్య తెలిపారు. పాడిరైతులు తప్పనిసరిగా పశువులకు టీకాలు వేయించాలని కోరారు.

ఇది ఇసుకేనా..మట్టి కుప్పా..!!



నర్సింగ్‌బట్ల ఇసుక రీచ్‌లో ట్రాక్టర్లు, రీచ్ నుంచి జిల్లా కేంద్రానికి సరఫరా అయిన పనికిరాని ఇసుక

- నర్సింగ్‌బట్ల ఇసుక రీచ్‌తో ఇబ్బందులు
- నిండా మునుగుతున్న నిర్మాణదారులు
- రీచ్‌లో కాకుండా పొలాల్లో మట్టిని ఎత్తుకువచ్చి సరఫరా
- పట్టించుకోని అధికారులు

నల్లగొండ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ మండల పరిధిలోని నర్సింగ్‌బట్ల గ్రామం నుంచి ప్రభుత్వ అనుమతితో ఉన్న ఇసుక రీచ్ నుంచి సరఫరా అవుతున్న ఇసుక నాణ్యతపై నిర్మాణదారులు గగ్గోలు పెడుతున్నారు. ఆన్‌లైన్ ద్వారా ఇసుకను స్లాట్ బుకింగ్ చేసుకుంటే మంచి ఇసుకను సరఫరా చేయాల్సిన అధికారులతో పాటు ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్లు, దళారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నిర్మాణాలకు పనికిరాని ఇసుకను సరఫరా చేస్తున్నారన్న ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. నర్సింగ్‌బట్ల ఇసుక ప్రధానంగా నల్లగొండ పట్టణంతో పాటు పరిసర గ్రామాలకు సరఫరా చేస్తున్నారు. ఒక ట్రాక్టర్ ఇసుకకు నల్లగొండ పట్టణానికి సరఫరా చేయడానికి రూ.2600 నుంచి రూ.2900 ఉండగా శివారు ప్రాంతాలకు రూ.3 నుంచి 3500 వరకు కూడా వెచ్చించాల్సి వస్తుంది.

అయినా నాణ్యమైన ఇసుక రాకపోవడంతో నిర్మాణాల్లో పగుళ్లు వచ్చి నిర్మాణదారులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారు. రీచ్‌లో ఇసుక ఉన్నదా లేదా అనేది గుర్తించాల్సిన అధికారులు ఆ వైపుగా చర్యలు తీసుకోవడం లేదు. దీంతో కొందరూ ట్రాక్టర్ యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

మట్టిని తలపిస్తున్న ఇసుక....

నల్లగొండ పట్టణానికి, శివారు ప్రాంతాలకు నర్సింగ్‌బట్ల ఇసుకరీచ్ నుంచి సరఫరా అవుతున్న ఇసుక మట్టిని తలపిస్తోంది. ఒక ట్రాక్టర్ ట్రిప్పు ఇసుకలో 60 శాతానికి పైగా పైగా మట్టి ఉంటే మిగతాది పనికిరాని దొడ్డు ఇసుక ఉండటం గమనార్హం. ఇందులో రాళ్లు, మట్టిపెళ్లలు, చెత్తాచెదారం, గడ్డి, ఇంకా ఇతర వ్యర్థ పదార్థాలన్నీ ట్రాక్టర్లలో తీసుకవస్తూ కుమ్మరించి పోతున్నారు. ఇదేమిటని వినియోగదారులు ప్రశ్నిస్తే ట్రాక్టర్ డ్రైవర్లు తమకేమీ తెలియదని, అధికారులను అడగాలని సూచిస్తున్నారు.

కానీ మంచి ఇసుకను తీసుకురావడం లేదు. అసలు మైనింగ్ అధికారులు ఏ మాత్రం రీచ్‌లను పరిశీలించడం లేదని తెలుస్తుంది. రెవెన్యూ అధికారులు సైతం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో గృహ నిర్మాణాలతో పాటు ఇతర నిర్మాణాలు చేపట్టే వారు అంతా తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ ఇసుకను వాడటం వల్ల కొద్దిరోజులకే ప్లాస్టింగ్‌లో పగుళ్లు వస్తున్నాయని నిర్మాణదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకపోతే కొంతమంది దళారులు ఇసుకను బుక్ చేసుకొని అధిక రేట్లకు కూడా విక్రయిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దళారులు మాత్రం మంచి ఇసుకను తెస్తామంటూ రీచ్‌లో తమకు అనుకూలంగా ఉంచుకున్న ప్రాంతంలో ఇసుకను తీసుకువచ్చి అదనంగా రూ.1000కి చొప్పున ట్రిప్పును విక్రయించుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. రెవెన్యూ, మైనింగ్ అధికారులు కనీసం నిర్మాణదారులపై సానుకూలంగా వ్యహరించకపోగా వాహనదారులకు, దళారులకు వంత పాడుతుండటం గమనార్హం. దీనికి తోడు అక్రమమార్గంలో కూడా ఇసుక దోపిడీ జరుగుతున్నట్లు తెలుస్తోంది. జీపీఎస్ సిస్టమ్ అనేది పేరుకే తప్ప వాడుకలో లేదని చర్చ సాగుతోంది. రీచ్‌లో ఇసుక కాకుండా వర్రెలు, ఒంపులు, గోతులల్లో ఇసుకను తీసుకువచ్చి సరఫరా చేస్తున్నట్లు నిర్మాణదారులు వాపోతున్నారు.

నాణ్యమైన ఇసుక సరఫరా చేయకుంటే చర్యలు

నిర్మాణదారులకు నాణ్యమైన ఇసుకను సరఫరా చేయకపోతే సంబంధిత సరఫరాదారులపై చర్యలు తీసుకుంటాం. కొంతమంది ట్రాక్టర్ డ్రైవర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. నర్సింగ్‌బట్ల నుంచి నాణ్యమైన ఇసుక సరఫరా కాకుంటే రీచ్‌ను సందర్శించి అందుకు కారణాలను పరిశీలిస్తాం. అక్రమాలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటాం. ఇసుకను కాకుండా మట్టితో కూడిన ఇసుకను సరఫరా చేస్తే సంబంధిత సరఫరా దారులపై శాఖాపరమైన చర్యలు ఉంటాయి.

- జాకబ్, మైనింగ్ శాఖ ఏడీ, నల్లగొండ

ఉపాధి కూలీలు 5 గంటలు పనిచేయాలి



ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో బండారు యాదగిరి

చండూరురూరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ కూలీలు ప్రతీ రోజు విధిగా 5 గంటలు పని చేయాలని, అప్పుడే రోజువారీ కూలీ రూ.307లు చెల్లించనున్నట్లు ఎంపీడీవో బండారు యాదగిరి అన్నారు. గురువారం మండలంలోని శిర్దెపల్లి గ్రామంలో చేపట్టిన ఉపాధి హామీ పనులు, నర్సరీలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో కూలీలకు ఫీల్డ్ అసిస్టెంట్లు 100 రోజులు ఉపాధి పనులు కల్పించాలని అన్నారు. నర్సరీల్లో మొక్కలకు రెండు పూటల నీళ్లు అందించాలని, రోజు రోజుకు ఎండలు పెరుగుతున్నాయని, ఎండిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు పెట్టాలని ఆయన సూచించారు. ఆయన వెంట ఏపీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు వేణు, అరుణ ఉన్నారు.

దైద నాగరాజుకు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న దైద నాగరాజు

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మనం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు, నార్కట్‌పల్లికి చెందిన దైద నాగరాజుకు అమెరికా దేశానికి చెందిన 'డే స్ప్రింగ్ థియలాజికల్ యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్' గౌరవ డాక్టరేట్‌ను ప్రకటించింది. గాడ్ సన్ హోలీ స్పిరిట్ థియోలాజికల్ అకాడమీ చైర్మన్ అండ్ డైరెక్టర్ ఎంపీ ప్రసాద్ అధ్యక్షతన గురువారం హైదరాబాద్‌లోని సూర్యలేక్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్ డాక్టర్ జీవీ వెన్నెల గద్దర్ నాగరాజుకు డాక్టరేట్‌ను అందజేశారు. సమాజాన్ని చైతన్యపరిచే కార్యక్రమాలతో పాటు నిత్యం చేపడుతున్న సేవా కార్యక్రమాలను పరిగణలోకి తీసుకున్న యూనివర్సిటీ నాగరాజును డాక్టరేట్‌కు ఎంపిక చేశారు. అమెరికాకు చెందిన ప్రఖ్యాత యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్న నాగరాజును పలువురు అభినందించారు.

ప్రసన్నాంజనేయస్వామి ఆలయ నూతన కమిటీ

మర్రిగూడ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయ నూతన కమిటీని గురువారం నిర్వహించిన సమావేశంలో ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా ము నగాల అంతిరెడ్డి, కమిటీ సభ్యులుగా వనమాల జైరాములు, చిలువేరు శంకర్, జిల్లా శంకర్, వస్పరి రాములమ్మతో దేవాదాయశాఖ అధికారి సుమతి ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో గ్రామ తాజామాజీ సర్పంచ్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి మాజీ సర్పంచ్ మేకల ప్రేమ్‌కుమార్, నాయకులు మునగాల జగన్‌రెడ్డి, వెంకటయ్యయాదవ్, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మట్టి రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ పద్మ

కనగల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాం చంద్రాపురం గ్రామం నుం చి లచ్చుగూడెం రోడ్డు వరకు సుమారు 2 కిలోమీటర్ల పొడువున నిర్మించే మట్టి రోడ్డు పనులను గురువారం గ్రామ మాజీ సర్పంచులు బల్గూరి పద్మ, డోటి నర్సింహ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు ఏర్పాటుతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే రైతులకు మేలు జరుగుతుందని అన్నారు. అడిగిన వెంటనే నిధులు మంజూరు చేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అందుగుల వెంకటేశం, కొప్పుల యాదగిరిరెడ్డి, వేమిరెడ్డి దిలీప్‌రెడ్డి, సైదులు, బిక్షం, సహదేవ, సురేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను బడిలో చేర్పించాలి

కట్టంగూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రతీ ఒక్కరు సహకరించాలని మండల విద్యాధికారి అంబటి అంజయ్య కోరారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా 2025-26 విద్యా సంవత్సరం ముందస్తుగా గురువారం కట్టంగూరు గ్రామపంచాయతీలో పరిధిలో అంబేద్కర్ నగర్, పద్మశాలి కాలనీ, అంబటి వాగుల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించి 25మంది విద్యార్థులను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అథోని, అబ్దుల్ గఫూర్, శ్రీనివాస్‌రెడ్డి, విఠల్ కుమార్, శ్రీనివాస్, లోహిత్, రవికుమార్ పాల్గొన్నారు.

శాలిగౌరారం : పిల్లను ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలని శాలిగౌరారం జడ్పీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు కోట మల్లయ్య కోరారు. ముందస్తు బడిబాట కార్యక్రమంలో భాగంగా శాలిగౌరారం మండలంలోని అంబారిపేట గ్రామంలో బడిబాట ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో పాటు నాణ్యమైన విద్య బోధించడం వల్ల సామాజిక స్పృహ కలుగుతుందన్నారు. ఉపాధ్యాయులు నిర్మల, సుజాత, అశోక్ కుమార్, శోభా, వెంకటయ్య, ఫజల్ పాషా తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ: ముందస్తు బడిబాట కార్యక్రమంలో భా గంగా శుక్రవారం ప్రాథమికోన్నత పాఠశాల వట్టిపల్లి ఉపాధ్యాయ బృందం చౌరస్తాలో ఉన్న కాలనీలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. మొదటి రోజు 20 మంది విద్యార్థులను పాఠశాలలో చేర్పించే విధంగా నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్వాయి వెంకట్‌రెడ్డి, ఎస్.నాగయ్య, డి.మంజులత, డి.బాలాజీ నాయక్, కె.లక్‌పతి, ఆర్.పల్లవి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలో జగదీష్‌రెడ్డి ఏం సాధించాడు?

● నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం



నకిరేకల్: విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీరేశం

నకిరేకల్, ఏప్రిల్ 17, (ఆంధ్రజ్యోతి): పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో కృష్ణా జలాలపై ఉమ్మడి జిల్లాకు చెందిన దద్దమ్మ, పనికిమాలిన మంత్రి జగదీష్‌రెడ్డి ఏం సాధించాడని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్ పన్నాలగూడెంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేఆర్ఎంబీ జలాల విషయంలో మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి చేస్తున్న ఆరోపణలను కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్‌కు పదేళ్లు అధికారం ఇస్తే కృష్ణా జలాల విషయంలో తెలంగాణ వాటా తేల్చలేని అసమర్థులని ఆయన విమర్శించారు. తెలంగాణ ఉద్యమం నీళ్లు, నిధులు, నియామకాల కోసమే పోరాటం జరిగిందని ఆ విషయంలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏం చేసిందని ఆయన ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 10 సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో ఉన్న కృష్ణా జలాలపై వాళ్లకంటే కాంగ్రెస్ ప్రభుత్వం అధికంగా వాడుకుందన్నారు. నల్లగొండ ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కృష్ణా జలాలపై అహర్నిశలు కృషి చేస్తుంటే జగదీష్‌రెడ్డికి పనిలేక అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో విద్యుత్‌శాఖ మంత్రిగా ఉన్న జగదీష్‌రెడ్డి ఎన్నిసార్లు సమీక్ష చేశారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇరిగేషన్ ప్రాజెక్టులపై జిల్లాకు సంబంధించిన మంత్రులు అనేక సార్లు సమీక్ష చేశారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఈ నెలలో జరిగే మీటింగ్ విజయవంతయ్యేందుకు కాంగ్రెస్ పార్టీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన విమర్శించారు.

అనంతరం స్థానిక జడ్పీహైస్కూల్‌లో ఎమ్మెల్యే నిధులు రూ. 10 లక్షలతో నిర్మించిన స్కూల్ భవనాన్ని ఆయన ప్రారంభించారు. శివాలయం ఆలయ పూజారి జిగురు లక్ష్మీనరసింహ మూర్తి హైస్కూల్‌లో కంప్యూటర్ల కోసం రూ.1.20 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నాగుల వంచ వెంకటేశ్వర్‌రావు, నాయకులు లింగాల వెంకన్న, యాసారపు వెంకన్న, పోతుల రవి, నకిరేకంటి నరేందర్, గడ్డం స్వామి తదితరులు పాల్గొన్నారు.

గోవిందహరికి శుభాకాంక్షలు

నార్కట్‌పల్లి: రాష్ట్ర ధార్మిక సలహాదారుడిగా నియామకమైన ఆర్.గోవిందహరిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఎమ్మెల్యే వేముల వీరేశం మర్యాద పూర్వకంగా కలిశారు. సలహాదారునిగా నియామకమవడం పట్ల శాలువాతో సన్మానించి పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలోని ఆలయాల్లో ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాలకు పెద్దపీట వేసేలా సలహాలు, సూచనలు ఇవ్వాలని ఆయనను కోరారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నాయకుడు సాగర్‌రెడ్డి ఉన్నారు.

వైభవంగా సీతారాముల శాంతికల్యాణం



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

కనగల్, ఏప్రిల్17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుడుమర్లపల్లి గ్రామంలో సీతా రామచంద్రస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాల్లో భాగంగా గురువారం సీతారాముల శాంతికల్యాణం వైభవంగా నిర్వహించారు. పండితుల వేద మంత్రోచ్చారణల నడుమ నిర్వహించారు. కల్యాణానికి సమీప గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో సంఖ్యలో హాజరయ్యారు. కల్యాణానికి తలంబ్రాలు, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కల్యాణం అనంతరం రథోత్సవాన్ని నిర్వహించారు. రథానికి మహిళలు నీళ్లారబోసి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, తదితురులు పాల్గొన్నారు.

'దివ్యాంగులకు అన్యాయం చేస్తున్న ప్రభుత్వం'

కట్టంగూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ప్రభుత్వం అన్యాయం చేస్తుందని తెలంగాణ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోలి ప్రభాకర్ అన్నారు. దివ్యాంగుల చైతన్య కార్యక్రమంలో భాగంగా గురువారం 10వ రోజు మండలంలోని బొల్లెపల్లి, మల్లారం గ్రామాల్లో ఆయన పర్యటించి దివ్యాంగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు కావస్తున్నా దివ్యాంగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని అన్నారు. దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను స్వీకరించారు. కార్యక్రమంలో నాయకులు గాయత్రి, ఈదమ్మ, సరిత, సత్యనారాయణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

నాంపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ దేవాసింగ్ అన్నారు. గురువారం మండలంలోని చిట్టెంపహాడ్, గట్లమల్లేపల్లి గ్రామాల్లో పెట్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చి ప్రభుత్వం కల్పించే మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో కేంద్రం ఇన్‌చార్జి పూదరి పురుషోత్తం, సీఈవో మాధవరెడ్డి, డైరెక్టర్లు గొల్లబోయిన వెంకటయ్య, రెడ్డిమల్ల రాములు, సిల్వర్ చంద్రశేఖర్, నల్లగాసు లింగస్వామి, గిరిబాబు, రైతులు పాల్గొన్నారు.

సీపీఎంలో పలువురి చేరిక

కట్టంగూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇస్మాయిల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నుంచి గురువారం కొంతమంది సీపీఎంలో చేరినట్లు ఆ పార్టీ మండల కార్యదర్శి పెంజర్ల సైదులు తెలిపారు. పార్టీలో చేరిన వారిలో మాద అడివయ్య, చెరుకు యాదయ్య, చెరుకు నర్సింహ, రాజు, అర్జున్, వెంకట్‌రెడ్డి, నర్సింహ, ఎల్లేష్ తదితరులు ఉన్నారు.

తపాలాశాఖ కార్యాలయాల్లో ఆధార్ సేవలు

రామగిరి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): తపాలాశాఖ కార్యాలయంలో ఆధార్ సేవలు అందుబాటులోకి వచ్చినట్లు పోస్టల్ సూపరింటెండెంట్ రఘునాథస్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ డెమొగ్రాఫిక్ అప్‌డేట్ కింద పేరు, చిరునామా, పుట్టిన తేది, లింగం, ఫోన్ నెంబర్, ఈ-మెయిల్, బయోమెట్రిక్ అప్‌డేట్, ఐరీస్ స్కాన్ వంటి సేవలు అందుబాటులోకి వచ్చినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



నిద్రపోతున్న నిఘా నేత్రం

నల్లగొండ పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు నిద్రపోతున్నాయి. ఏవైనా ప్రమాదాలు జరిగినప్పుడు నిందితుల వివరాలు సేకరించేందుకు ఉపయోగపడే సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వెంటనే వాటిని మరమ్మతులు చేసిన వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

పట్టు తప్పితే ప్రాణాలు హరి



ఆటోలో ప్రమాదకరంగా నిల్చున్న కూలీలు

చండూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఎన్ని చర్యలు చేపడుతున్నా..పోలీసులు జరిమానాలు విధించినా కొందరు డ్రైవర్ల నిర్లక్ష్యం మితిమీరుతోంది. ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని ఆటోల్లో పరిమితికి మించి తరిస్తున్నారు. పట్టు జారితే ప్రాణాలు గాలిలో కలిసే ప్రమాదం ఉన్నా డ్రైవర్లు అదే విధంగా వ్యవహరిస్తున్నారు. ఆదాయమే ముఖ్యంగా ప్రయాణికుల ప్రాణాలు మాకెందుకు అన్న ధోరణిలో వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా వ్యవసాయ కూలీలను పరిమితికి మించి ఎక్కించుకుని తరలిస్తున్నారు. కనీసం ఆటో హ్యాండిల్ తిప్పేందుకు కూడా వీలు లేకుండా కూలీలను ఎక్కించుకుంటున్నారు. చండూరులో వార సంత కావడంతో పరిసర గ్రామాల నుంచి సకాలంలో బస్సులు లేకపోవడంతో ఇలా పట్టణానికి వస్తూ నిత్యం కనిపిస్తారు. గతంలో పరిమితికి మించి ప్రయాణం చేస్తున్న వాహనాలు బోల్తా పడి పలువురు ప్రయాణికులకు గాయాలు కాగా, మరికొందరు మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. ఇలాంటి ప్రమాదకర ప్రయాణం చేయడం ఆందోళన కలిగిస్తోంది. పోలీసులు, రోడ్డు రవాణాశాఖ అధికారులు ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు ప్రసన్నరాజ్

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మాన్యంచెల్కలో బలవన్మరణానికి పాల్పడిన కత్తుల మాధురి కుటుంబ సభ్యులకు మాదిగ సంఘాల జేఏసీ, అంబేడ్కర్, జగ్జీవన్‌రాం సేవా సంఘం సభ్యులు ప్రగాఢ సంతాపం తెలిపారు. అనంతరం అంత్యక్రియల కోసం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో మాదిగ సంఘాల జేఏసీ, అంబేడ్కర్, జగ్జీవన్‌రాం సేవా సంఘం గౌరవాధ్యక్షుడు కత్తుల షణ్ముక్‌కుమార్, మాజీ అధ్యక్షుడు కత్తుల శంకర్, షెడ్యూల్ కులాల సంఘాల సేవాసంఘం జిల్లా అధ్యక్షుడు కత్తుల జగన్‌కుమార్, రాష్ట్ర కన్వీనర్ పెరిక కరన్‌జయరాజ్, పెరిక ఉమామహేశ్వర్, సంఘకార్యదర్శులు వి.యాదగిరి, కందుల లక్ష్మయ్య, చింత శివరామకృష్ణ, బాషపాక హరికృష్ణ, పెరిక అంజయ్య, మైనం శ్రీనివాస్ రమేష్ పాల్గొన్నారు.

శాలిగౌరారం: శాలిగౌరారంలోని హమాలీ గుడిపాటి సైదులు, బట్ట సతీష్‌లు ఇటీవల అనారోగ్యంతో మరణించారు. బాధిత కుటుంబాలను చైత్ర ఫౌండేషన్ రామకృష్ణగౌడ్ కలిసి వారిని ఓదార్చి ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణగౌడ్ మాట్లాడుతూ సైదులు, సతీష్ అకాల మరణం వారి కుటుంబాలకు తీరని లోటని, చైత్ర ఫౌండేషన్ తరపున ఎల్లప్పుడు పేద కుటుంబాలకు అండగా ఉంటూ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు.

బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ

కేతేపల్లి: 65వ నెంబరు జాతీయ రహదారిపై ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నలగాటి ప్రసన్నరాజ్ గురువారం పరామర్శించారు. మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన అప్పాల గణేష్, పూర ప్రవీణ్‌లు మండలంలోని చీకటిగూడెం బస్టాప్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. గురువారం కొత్తపేట గ్రామంలోని బాధితుల ఇళ్లకు వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయా కుటుంబాలకు ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల నాయకుడు మాజీ మార్కెట్ చైర్మన్ చల్లా కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ జానకిరాములు ఉన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

● సీడీపీవో లావణ్యకుమారి

చండూరురూరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని మునుగోడు సీడీపీవో లావణ్యకుమారి అన్నారు. పోషణ్ పక్వాడాలో భాగంగా గురువారం మండలంలోని చామలపల్లి, కస్తాల గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. గర్భిణులు గర్భం దాల్చిన మొ దలు పిల్లలు రెండేళ్లు నిండే వరకు 1000 రోజులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని అన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు సమతుల ఆహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సూచించారు. ఆడపిల్లలకు కౌమార దశలో రక్తహీనత సమస్య నుంచి బయటపడాలంటే చిరుధాన్యాలతో కూడిన పౌష్టికాహారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఏసీడీపీవో వెంకట మ్మ, సూపర్‌వైజర్ యాదమ్మ, జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం పద్మావతి, అంగన్‌వాడీ టీచర్లు హైమావతి, రజని, వీవోఏ సుగుణ, గర్భిణులు, బాలింతలు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.



చామలపల్లిలో అవగాహన కల్పిస్తున్న సీడీపీవో లావణ్యకుమారి

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.142	220	240
సూర్యాపేట	రూ.170	240	270
నల్లగొండ	రూ.142	206	234

ఉష్ణోగ్రత గరిష్ఠం 39.0 । కనిష్ఠం 23.4

అంగన్‌వాడీలా

» అద్దెభవనాల్లో కేంద్రాల నిర్వహణ
» రేకులషెడ్డు, ఇరుకు గదులతో చిన్నారులకు ఇక్కట్లు
» వేసవి ఉక్కపోతతో తల్లడిల్లుతున్న పిల్లలు



ఉక్కపోతతో అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అసౌకర్యాల నడుమ అద్దె భవనాల్లో నడుస్తున్న కేంద్రాల్లో ఇప్పటికే చిన్నారులు ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, వేసవి కాలం కావడంతో ఉక్కపోతకు గురవుతున్నారు. ఇదిలా ఉండగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో చాలాచోట్ల అద్దె భవనాల్లోనే కేంద్రాలు కొనసాగుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో రేకులషెడ్డులో కేంద్రాలు ఉండటంతో గదిలో వేడిమికి చిన్నారులు విలవిల్లాడుతున్నారు. ముఖ్యంగా పట్టణాల్లో అద్దె తక్కువగా ఉండటంతో అన్నిసౌకర్యాలు ఉన్న భవనాలు దొరకడం లేదు. దీంతో చిన్నగదుల్లో పెద్దసంఖ్యలో పిల్లలతో నిర్వహిస్తున్న కేంద్రాల్లో పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది.

- వివరాలు 6లో

ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల పై నియంత్రణేదీ!

ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలపై ప్రభుత్వ నియంత్రణ కొరవడింది. అయిదారేళ్లకు ఒక్కసారి కూడా ఏజెన్సీల పనితీరుపై ఆడిట్ కొరవడింది. కనీస ప్రమాణాలను పాటించకుండా ఏజెన్సీలను నిర్వహిస్తోన్న వారిపై చర్యలు తీసుకోవడంలో అధికార యంత్రాంగం విఫలమవుతోంది. ఏజెన్సీల ద్వారా పనిచేసే కార్మికులు, ఉద్యోగుల భద్రత, సంక్షేమం విషయంలో ఏజెన్సీల నిర్లక్ష్యంపై పలు సందర్భాల్లో ఉద్యోగులు, కార్మికులు ఆందోళనలకు దిగినా పరిస్థితిలో మార్పు రాలేదు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)



» ఏళ్లుగా కరువైన ఆడిట్
» గాడితప్పిన ఏజెన్సీలతో అవస్థలు పడుతోన్న కార్మికులు, ఉద్యోగులు
» లష్కర్, హెల్పర్ పోస్టులకోసం లాటరీ ద్వారా ఏజెన్సీ ఎంపిక చేయాలని నిర్ణయం
» నీటిపారుదలశాఖలో వీటికోసం తాజాగా నోటిఫికేషన్
» ఏజెన్సీలను క్రమబద్ధీకరించకుండా లాటరీ విధానం వద్దనే అభిప్రాయాలు

లాటరీ ద్వారా ఎంపిక వద్దనే డిమాండ్లు

జిల్లాలో ఖచ్చితమైన ప్రమాణాలు పాటించే ఏజెన్సీ లేవో, నామమాత్రంగా ఉన్న ఏజెన్సీలేవో తేల్చడంలేదు. నీటిపారుదలశాఖ వంటి కీలక శాఖల్లో లష్కర్లు, హెల్పర్ల భారీ నియామకాలకు లాటరీ పద్ధతిలో ఏజెన్సీలను ఎంపిక చేయాలని నిర్ణయించడం సరికాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముందస్తుగా ఏజెన్సీలను పూర్తిస్థాయిలో క్రమబద్ధీకరించాలని, ఆతర్వాతే లాటరీ విధానంలో ఏజెన్సీల ఎంపిక చేపట్టాలనే డిమాండ్ వస్తోంది.

జిల్లాలో భారీగా ఏజెన్సీలు.. అంతేస్థాయిలో ఫిర్యాదులు

జిల్లాలో ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల పనితీరుపై తీవ్రస్థాయి లో విమర్శలున్నాయి. జిల్లాలో 2021 నుంచి ఇప్పటి వర కు ఉపాధికల్పనా కార్యాలయంలో ఎన్‌ప్యానల్ అయిన 97 ఏజెన్సీలున్నాయి. ఆసుపత్రులు, మున్సిపాలిటీల్లో పారిశుధ్య నిర్వహణతోపాటు, డీటీపీ ఆపరేటర్లు, వాచ్‌మెన్లు, నాలుగో తరగతి ఉద్యోగులు, క్లరికల్ క్యాడర్‌లో పనిచేసే ఉద్యోగులను పలు శాఖల్లో ఔట్‌సోర్స్ ఏజెన్సీలు నిర్వహిస్తున్నాయి. వీటిలో కొన్ని ఏజెన్సీలు నిబంధనల ప్రకారం పనిచేస్తుండగా, మరికొన్ని ఉనికిలో లేకుండా పోయా యి. ఇంకొన్ని ఏజెన్సీలు కనీస ప్రమాణాలు పాటించడంలేదు. తమ ఏజెన్సీల కింద పనిచేసే కార్మికులు, ఉద్యోగులకు సంబంధించి పీఎఫ్, ఈఎస్‌ఐలకు సంబంధించి ఎంప్లాయర్ వాటాలు సైతం సంవత్సరాల తరబడి చెల్లించకుండా కాలయాపన చేస్తున్నట్లు సమాచారం. మరికొన్ని ఏజెన్సీలు వేతనాల్లో కమీషన్లు భారీగా కోత విధిస్తున్నారనే ఆరోపణలున్నాయి. కొన్ని ఏజెన్సీలు తక్కువమంది కార్మికులతో ఎక్కువ పని చేయించి, లేని కార్మికుల పేర్లను జతచేసి వేతనాలు పొందుతున్నాయనే....

- మిగతా 8వ పేజీలో...

నీటిపారుదలశాఖ, నల్లగొండ డివిజన్ పరిధిలో 229 లష్కర్లు, 56 హెల్పర్ల పోస్టులకు అవుట్‌సోర్సింగ్ సేవల ద్వారా నియామకాలు చేపట్టాలని చీఫ్ ఇంజనీరింగ్ కార్యాలయం నిర్ణయించింది. ఈ మేరకు జిల్లాలో ఎన్‌ప్యానల్ అయిన ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల నుంచి ఈ నెల 19 సాయంత్రంలోగా దరఖాస్తు చేసుకోవాలని నోటిఫికేషన్ ఇచ్చారు. ఆసక్తి చూపిన ఏజెన్సీల నుంచి లాటరీ పద్ధతిన ఏజెన్సీని ఎంపిక చేయాలని అధికారులు నిర్ణయించారు. అయితే కీలకమైన నీటిపారుదలశాఖలో ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీని లాటరీ పద్ధతిలో ఎంపికచేయాలనే నిర్ణయంపై విమర్శలు వస్తున్నాయి. జిల్లాలో పుట్టగొడుగుల్లా ఉన్న ఔట్‌సోర్స్ ఏజెన్సీల్లో చాలా ఏజెన్సీలపై పలు ఆరోపణలున్నాయని, అదేవిధంగా ఆయా ఏజెన్సీల్లో పనిచేసే కార్మికులు, ఉద్యోగులే అనేక సందర్భాల్లో వేతనాలకోసం, ఈఎస్‌ఐ, పీఎఫ్ షేర్లకోసం కలెక్టర్లకు వినతిపత్రాలిచ్చిన ఘటనలు వెలుగులోకి వచ్చాయి. కొన్ని ఏజెన్సీల పని విధానంలోనూ ఆయా శాఖల ఉన్నతాధికారులు అభ్యంతరాలు, అసంతృప్తి వ్యక్తం చేస్తున్నా రాజకీయ పలుకుబడి, అధికారుల ఉదాసీనతతో నెట్టుకొస్తున్నారని, ఇలాంటి సందర్భంలో పెద్దసంఖ్యలో ఉద్యోగాలకు సంబంధించిన వ్యవహారంలో లాటరీ పద్ధతిలో ఏజెన్సీని ఎంపికచేయడం తగదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తొలుత జిల్లాలోని ఔట్‌సోర్స్ ఏజన్సీల పనితీరుపై నిర్దీత ప్రమాణాల మేరకు ఉన్న సంస్థలను గుర్తించాలని, ఆరోపణలు, ఫిర్యాదులున్న ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని మొత్తంగా ఔట్‌సోర్స్ ఏజెన్సీ వ్యవస్థను క్రమబద్ధీకరించిన తర్వాతే లాటరీ విధానం ప్రవేశపెడితే బాగుంటుందని, లేదంటే ప్రమాణాలు లేని ఏజెన్సీకి లాటరీ వస్తే ఈ ఉద్యోగుల భవిష్యత్, నీటిపారుదలశాఖకు తలనొప్పి తప్పదనే అభిప్రాయం వెల్లడవుతోంది. ఈ నియామకాలకు కనీస ప్రమాణాలు, నియమ, నిబంధనలు రూపొందించి వాటికి అర్హత ఉన్న ఏజెన్సీలే లాటరీలో పాల్గొనేలా మార్పులు చేయాలని, లేదంటే దళారులు ఏజెన్సీల ముసుగులో ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్‌ని దక్కించుకుంటే ఆతర్వాత నిర్వహణలు ఇటు ఉద్యోగులకు, అటు నీటిపారుదలశాఖకు తలనొప్పి తప్పదనే అభిప్రాయాలు వెల్లడవుతున్నాయి. కలెక్టర్ సహా జిల్లా ఎన్‌ప్యానల్‌మెంట్ కమిటీ పునరాలోచించి నిర్ణయం తీసుకోవాలనే సూచనలు వస్తున్నాయి.

భూభారతితో భూ సమస్యలకు పరిష్కారం

» ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్, కలెక్టర్ ఇలా త్రిపాఠి » పలు మండలాల్లో అవగాహన సదస్సులు



దేవరకొండ మండలం కొండభీమనపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్, పక్కన కలెక్టర్ ఇలాత్రిపాఠి

దేవరకొండ, చింతపల్లి, కొండమల్లేపల్లి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): భూభారతి చట్టంతో భూసమస్యలు పరిష్కారం అవుతాయని, ప్రతి రైతుకు మేలు జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకువచ్చిందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. గురువారం దేవరకొండ మండలం కొండభీమనపల్లి, చింతపల్లి కొండమల్లేపల్లి మండలకేంద్రాల్లో భూభారతి చట్టం (భూమి హక్కుల రక్షణచట్టం 2025)పై రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సుల్లో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూసమస్యలతోపాటు ఇళ్ల స్థలాలకు సంబంధించిన సమస్యలను భూభారతితో పరిష్కరించుకోవచ్చునన్నారు. ధరణి పోర్టల్‌లో లేని అనేక సమస్యలకు పరిష్కారం భూభారతి చట్టం ద్వారా పరిష్కారమవుతుందన్నారు. భూభారతిచట్టంపై గ్రామ, గ్రామాన రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. వందేళ్ల వరకు ఈచట్టం ఉపయోగపడుతుందని తెలిపారు. జూన్ 2 నుంచి భూభారతి చట్టం పోర్టల్ పని చేస్తుందన్నారు. ఎలాంటి భూ వివాదాలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ఎన్నోరోజుల ఆలోచనచేసి మేధావులు, అధికారులు అందరితో చర్చించిన పిదప ప్రభుత్వం ఈ చట్టం రూపొందించడం జరిగిందన్నారు.

రైతు భూములకు భరోసా : కలెక్టర్

రైతు భూములకు భరోసా కల్పించే చట్టం భూభారతి అని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. ధరణి పోర్టల్‌లోలేని అనేక సమస్యలకు పరిష్కారం భూభారతిలో దొరుకుతుందని, జూన్ 2 నుంచి ఆన్‌లైన్‌లో చట్టం పోర్టల్ పనిచేస్తుందన్నారు. భూములకు సంబంధించిన సమస్యలపై రైతులు మీసేవా లాగనే భూభారతి పోర్టల్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చునని, ఏదైనా సమస్య పరిష్కారానికి దరఖాస్తు చేస్తే నిర్దేశించిన సమయంలో పరిష్కారమవుతాయన్నారు. ఒకవేళ పరిష్కరించలేకపోతే చలాన్ ద్వారా చెల్లించిన మొత్తాన్ని తిరిగి చెల్లించడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం డిసెంబరు 31న భూభారతి చట్టంలోని నిబంధనల ప్రకారం రికార్డులను అప్‌డేట్ చేయడం జరుగుతుందని తెలిపారు. భూభారతి పోర్టల్‌లో నమోదైన రికార్డుల ఆధారంగానే రైతులకు బ్యాంక్ రుణాలను రైతులకు అందజేస్తుందన్నారు. రైతులు భూభారతి చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భూములకు సంబంధించిన నక్ష, సర్వే నెంబర్ ఇతర వివరాలన్నీ శాస్త్రీయమైన పద్ధతిలో ఈ చట్టంలో పొందుపర్చడం జరిగిందన్నారు. మ్యూటేషన్లకు సం బంధించి 30 రోజుల్లో మ్యూటేషన్లకు కాకపోతే ఆటోమెటిక్‌గా 31వ రోజు మ్యూటేషన్ అవుతుందన్నారు. ఈ సదస్సుల్లో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, దేవరకొండ ఏఎస్పీ మౌనిక, దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, తహసీల్దార్లు సంతోష్ కిరణ్, రమాకాంత్‌శర్మ, అన్వర్‌హుస్సేన్, ఎంపీడీవోలు డానియేల్ సుజాత,బాలరాజురెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దొంతం ఆలివేలా సంజీవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ లింగంపల్లి వెంకటయ్య, ఏడీఏ శ్రీలక్ష్మీ, ఏవోలు శ్రావణికుమారి, జానకిరాములు, ఉట్కూరి వేమన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల వేణుధర్‌రెడ్డి ఉన్నారు.

కొనుగోళ్లు వేగవంతం చేయాలి

● డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి

నిడమనూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు వేగవంతంచేసి, కాంటాలు వేసిన ధాన్యం ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి కేంద్రం నిర్వాహకులను ఆదేశించారు. మండలంలోని ఊట్కూరులో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పా టు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన గురువారం సందర్శించి కొనుగోళ్లను పరిశీలించారు. వర్షాలు కురిసే ప్రమాదం ఉందని, కేంద్రానికి వస్తున్న ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయాలని సూచించారు. సిబ్బంది కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోళ్లు చేపట్టాలన్నారు. రైతులు పండించిన ధాన్యాని కి కనీస మద్దతు ధర అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతి సీజన్‌లో కొనుగోలు కేంద్రా లు ఏర్పాటుచేసి ధాన్యాన్ని కొంటుందన్నారు. రైతులు నిబంధనల ప్రకారం నాణ్యమైన ధా న్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి కనీస మద్దతు ధర పొందాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో బోనగిరి రమేష్, ఏపీఎం లక్ష్మీనారాయణ, ఏఈవో మహేష్ పాల్గొన్నారు.



ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో అధికారులతో మాట్లాడుతున్న శేఖర్‌రెడ్డి

సోనియా, రాహుల్‌పై కేసులను ఉపసంహరించుకోవాలి

» కాంగ్రెస్ ఎదుగుదలను చూసి ఓర్వలేకనే కేసులు » ఎమ్మెల్సీ శంకర్‌నాయక్
» ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసనలు



దిష్టిబొమ్మను దహనం చేసి మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సోనియా, రాహుల్ గాంధీలపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ డిమాండ్ చేశారు. నేషనల్ హెరాల్డ్ కేసులో ఏఐసీసీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలపై ఈడీ అక్రమంగా చార్జ్‌షీట్ నమోదు చేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఎదుగుదలను చూసి ఓర్వలేక కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నేషనల్ హెరాల్డ్ పత్రిక కేసులో కాంగ్రెస్ అగ్రనేతలపై అక్రమ కేసులు బనాయించిందన్నారు. కాంగ్రెస్ బడుగు, బలహీన వర్గాల కోసం నిరంతరం పనిచేసే పార్టీ అన్నారు. కాంగ్రెస్‌ను బలహీనపరిచేందకు బీజేపీ కుట్ర పన్నుతోందన్నారు. అందులో భాగంగా అగ్రనేతలపై కేసులు పెడుతుందని ఆరోపించారు. దేశంలో కేంద్ర ప్రభుత్వం అరాచక పాలన కొనసాగిస్తుందన్నారు. బీజేపీ ప్రభుత్వంలో దేశ సంపదంతా సంపన్నులే దోచుకుంటున్నారని ఆరోపించారు. దేశం మొత్తం కులగణన చేసి, ఎవరికి దక్కాల్సిన వాటా వారికి ఇవ్వాలని రాహుల్‌గాంధీ పోరాటం చేస్తున్నారని, దీనిని జీర్ణించుకోలేక మోదీ ప్రభుత్వం ఈడీని అడ్డంపెట్టుకొని అక్రమ కేసులుపెడుతుందన్నారు. ఎన్ని కుట్రలు పన్నినా రాహుల్‌గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ముందుకుపోతూ అన్ని వర్గాల పేద ప్రజల హక్కులకోసం పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో నల్లగొండ మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, మార్కెట్ చైర్మన్ జూకూరి రమేష్, నాయకులు కేసాని వేణుగోపాల్‌రెడ్డి, జూలకంటి శ్రీనివాస్, సమద్, పెరిక వెంకటేశ్వర్లు, బొజ్జ శంకర్, ఇంతియాజ్‌హుస్సేన్, అల్లి సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

వానాకాలం యాక్షన్ ప్లాన్ సిద్ధం



జిల్లాలో వానాకాలం పంటల సాగుకు వ్యవసాయ శాఖ ప్రణాళికలు సిద్ధంచేసింది. ఇందుకు సంబంధించి ప్రభుత్వానికి నివేదిక పంపించింది. వ్యవసాయశాఖ పెట్టిన ఇండెంట్ ప్రకారం ఎరువులు, విత్తనాలను ప్రభుత్వం సరఫరా చేయనుంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే కొంత మేరకు బఫర్ స్టాక్‌ను వ్యవసాయ శాఖ అందుబాటులో ఉంచింది.

- (ఆంధ్రజ్యోతి-నల్లగొండ)

» 11,60,389 ఎకరాల్లో పంటల సాగుపై అంచనా
» పత్తి 5,47,735 ఎకరాల్లో, వరి 5,25,350 ఎకరాల్లో సేద్యం
» విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచనున్న వ్యవసాయ శాఖ

2024 వానాకాలంలో 11,50,556 ఎకరాల్లో వివిధ పంటలు సాగు కాగా, ఈ సారి అంటే 2025 వానాకాలంలో 11,60,389 ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేస్తుంది. వీటిలో ప్రధానంగా పత్తి 5,47,735 ఎకరాల్లో, వరి 5,25,350 ఎకరాల్లో సేద్యం కానుండగా 10 వేల ఎకరాల్లో కందులు వేయనున్నారు. గత ఏడాదితో పోలిస్తే కేవలం 10వేల ఎకరాల్లో మాత్రమే అధికంగా సేద్యమయ్యే అవకాశాలున్నాయి. మే మూడో వారంలో అకాల వర్షాలు కురిసినట్లయితే చాలామంది రైతులు ముందే సిద్ధం చేసుకున్న వేసవి దుక్కుల్లో పత్తి విత్తనాలు వేసుకుంటారు. వ్యవసాయశాఖ నిండు వేసవిలో విత్తనాలు వేయకుండా తదుపరి వర్షాలు వచ్చే అవకాశం ఉన్నప్పుడు మాత్రమే విత్తనాలు వేసుకోవాలని వ్యవసాయ శాఖ సూచిస్తుంది. అదేవిధంగా పెసర్లు 1200 ఎకరాల్లో, వేరుశనగ 1500 ఎకరాల్లో ఈ సారి సాగు చేయనున్నారు. ఇక ఉద్యాన పంటలకు సంబంధించి 73వేలకుపైగా ఎకరాల్లో సాగుకానుంది. ఇందులో ప్రధానంగా కూరగాయలు మిర్చి, పప్పు దినుసు పంటలు కూడా సాగు చేస్తారని ఓ అంచనాకు వచ్చారు.

పత్తి, వరి విత్తనాలతోపాటు

వచ్చే వానాకాలానికి సంబంధించి పత్తి, వరితోపాటు ఇతర పప్పుదినుసుల పంటకు సంబంధించి విత్తనాల అవసరం అధికంగానే ఉంది. గత ఏడాది పత్తి విత్తనాలు 13.80లక్షల ప్యాకెట్లు అవసరం కాగా, ఈసారి 16.81లక్షల ప్యాకెట్ల విత్తనాలు అవసరం ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఒక్కో ప్యాకెట్‌లో 450 గ్రాముల విత్తనాలు ఉంటాయి. ఇక వరి విత్తనాలకు సంబంధించి గత సంవత్సరం 1,01,352 క్వింటాళ్ల రైతులకు పంపిణీ చేయగా, ఈ సారి 1,26,800 క్వింటాళ్ల విత్తనాలు అవసరం ఉంటాయని వ్యవసాయశాఖ ఇండెంట్ పెట్టింది. ఇందులో ఎంటీయూ 1010, బీపీటీ 5204, ఆర్‌ఎన్‌ఆర్ 15,048, జీజేఎల్ విత్తనాలను కూడా తెప్పించనున్నారు. కందులు 1,250 క్వింటాళ్లు అవసరం ఉండగా గత సంవత్సరం 335 క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ చేశారు. ఇక పెసర్లు గత సంవత్సరం 35 క్వింటాళ్లు, ఈసారి 149 క్వింటాళ్లు ఇక వేరుశనగ గతఏడాది 64 క్వింటాళ్లు ఉపయోగించగా, 1,545 క్వింటాళ్లను పంపిణీ చేయనున్నారు.

వానాకాలం పంటల సాగుకు సర్వసిద్ధం



ప్రభుత్వ ఆదేశాలమేరకు వానాకాలం పంటల సాగుకు సర్వం సిద్ధమైంది. యాక్షన్ ప్లాన్‌ను రూపొందించి ప్రభుత్వానికి పంపించాం. ఈ సీజన్‌కు ఏమేరకు విత్తనాలు, ఎరువులు అవసరమనే దానిపై నివేదికను సిద్ధంచేశాం. సకాలంలో ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచనున్నాం. సమృద్ధిగా వర్షాలు కురిసిన తర్వాత విత్తనాలు వేసుకోవాలి. ఈసారి భారీ వర్షాలు నమోదవుతాయని వాతావరణ శాఖ పేర్కొన్న నేపథ్యంతో పంటల సాగు అనుకున్న దానికంటే ఎక్కువ అయ్యే అవకాశాలు ఉన్నాయి.

- పి.శ్రవణ్ కుమార్, జేడీఏ, నల్లగొండ

ఎరువులు 3,66,869 మెట్రిక్ టన్నులు

ఈసారి వానాకాలం పంటల సాగుకు 3,66,869 మెట్రిక్ టన్నుల అవసరం ఉంటుంది. 2025-26కు సంబంధించి యూరియా 1,44,802 మెట్రిక్ టన్నులు, డీఏపీ 61,343 మెట్రిక్ టన్నులు, ఎంవోపీ 33,758 మెట్రిక్ టన్నులు అవసరం ఉంది. కాంప్లెక్స్ ఎరువులు 1,14,043 మెట్రిక్ టన్నులు ఎస్‌ఎస్‌పీ 12,923 మెట్రిక్ టన్నులు ఈసారి అవసరం ఉంది. ఎరువులు ప్రధానంగా అత్యధికంగా పత్తి, వరి పంటలకు మాత్రమే ఉపయోగించనుండగా స్వలంగా కందులు, ఇతర మెట్ట పంటలకు వేస్తారు. ఈ సారి నైరుతి రుతుపవనాలు ముందుగానే వస్తాయని, భారీ వర్షపాతాలు నమోదవుతాయని భారత వాతావరణ శాఖ తెలియజేసిన నేపథ్యంలో రైతులు ఉత్సాహంగా ఉన్నారు. జూన్ కంటే ముందే వర్షాలు వచ్చినా, లేదంటే జూన్‌లో తొలకరి వర్షాలు కురిసిన వెంటనే సాగయ్యే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో వ్యవసాయశాఖ యంత్రాంగం సర్వం సిద్ధంగా ఉంది. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు వర్షాలు పడటానికి ముందే విత్తనాలు, ఎరువులను సమృద్ధిగా ఉంచడంతోపాటు మండలకేంద్రాలకు సకాలంలో చేరవేసేలా ప్రణాళికలను రూపొందిస్తున్నారు.

60 రోజులు.. 30 సమావేశాలు

» ఎమ్మెల్యే బీఎల్ఆర్ » మునిసిపల్ అధికారులకు దిశానిర్దేశం



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు 60 రోజుల్లో 30 సమావేశాలు నిర్వహిస్తామని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, ఆక్రమణలకు అడ్డుకోవాలని ఆదేశించారు. పట్టణంలో పరిశుభ్రతకు రెండు నెలల కార్యాచరణ ప్రకటించారు. పట్టణాన్ని అన్ని విభాగాల్లో అభివృద్ధి చేయాలని, నాలాల్లో వ్యర్థాలను తొలగించాలని, ఆదాయ మార్గాలను నిర్లక్ష్యం చేయరాదని ఆదేశించారు. నిర్దేశించి న లక్ష్యాలను అధిగమించాలని అధికారులకు సూచించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలుచేయాలని, రెండు నెలల పాటు రోజు విడిచి రోజు సమావేశం నిర్వహిస్తామన్నారు. బస్టాండు, కూరగాయల మార్కెట్, రైతుబజారు, ప్రధాన కూడళ్లలో చెత్తకుప్పలు ఉండకుండా చూడాలని, డ్రైనేజీ పనులను ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. వీధి దీపాలు. తాగునీరు, దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశానికి ఉద్యోగులందరూ హాజరై వార్డు అధికారులు పట్టణంలో పర్యటించి సమస్యలు గుర్తించాలన్నారు.

మూడు నెలల్లో మార్పు రాకుంటే..

పట్టణంలో ఎక్కడా చెత్త కనిపించొద్దు. అన్ని వార్డుల్లో పర్యటిస్తాం. చెత్తకుప్పలు కనిపిస్తే ఆ చెత్తను తెచ్చి మునిసిపల్ కార్యాలయంలో పడేస్తానంటూ అధికారులకు ఎమ్మెల్యేచురకంటించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వార్డు ఆఫీసర్లు జవాన్లతో సమన్వయంతో పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలన్నారు. పట్టణంలోని రహదారులు, ప్రభుత్వ స్థలాలు, క్రీడామైదానాలను ఆక్రమించి వ్యాపారాలు సాగించేవారిని నివారించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేస్తున్న బడ్డీకొట్లు, తోపుడు బండ్లను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

చింతపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): చింతపల్లి మండలంలోని మదనాపురం లక్ష్మీ నరసింహ ఆలయంలో బ్రహ్మోత్సవాలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో సుప్రభాతసేవ, చక్రస్నానం, ప్రదోశపూజ, తదితర కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ డేరంగుల మహేష్, నాయకులు జంగిటి నరసింహ, జంగిటి శ్రీనివాస్, అర్చకులు మురుకుంట్ల రవిశర్మ పాల్గొన్నారు.

మిర్యాలగూడలో రేపు రన్ ఫర్ జీసెస్

మిర్యాలగూడ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రన్‌ఫర్ జీసెస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మిర్యాలగూడ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 6 గంటలకు సాగర్‌రోడ్డు ఫ్లైఓవర్ నుంచి రాజీవ్‌చౌక్ వరకు రన్‌ఫర్ జీసెస్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. క్రిస్టియన్లు అధికసంఖ్యలో హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు.

ప్రభుత్వ పథకాలు ప్రజలకు వివరించాలి

● ఎమ్మెల్సీ శంకర్‌నాయక్


శంకర్‌నాయక్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నిడమనూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు వివరించాలని ఎమ్మెల్సీ, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ అన్నారు. పట్టణంలోని మార్కెట్ యార్డులో గురువారం కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ పార్టీ కోసం కార్యకర్తలు నిబద్ధతతో పని చేయాలన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం ప్రజా పాలన చేస్తుంటే ఓర్వలేక ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని విమర్శించారు. ప్రతిపక్షాలు ప్రభుత్వంపై చేస్తున్న ఆరోపణలను కార్యకర్తలు సమర్థంగా తిప్పికొట్టాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అంకతి సత్యం, నాయకులు నందికొండ మట్టారెడ్డి, శివమారయ్య, నర్సింగు విజయ్, శేష రాజు దాసు, ఆలంపల్లి మైసయ్య, మోసాల శ్రీను, పోలే రవి, పురుషోత్తంరెడ్డి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



పోస్టర్‌లను విడుదల చేస్తున్న పల్లా దేవేందర్‌రెడ్డి

దేవరకొండ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని భవన నిర్మాణ కార్మికసంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లా దేవేందర్‌రెడ్డి అన్నారు. దేవరకొండ పట్టణంలోని పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టాన్ని అమలుచేయాలని కోరారు. అనంతరం రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో ఈనెల 21, 22 తేదీల్లో జరగనున్న భవన నిర్మాణ కార్మికసంఘం రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి, భవన నిర్మాణ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి మల్లయ్య, వెంకట్రాములు, లక్ష్మీనారాయణ, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ సదస్సును జయప్రదం చేయాలి


సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

నాగార్జున సాగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): త్రిపురారం మండల కేంద్రంలో ఈ నెల 20వ తేదీన నిర్వహించే ఐఎన్‌టీయూసీ నియోజకవర్గస్థాయి సదస్సును జయప్రదం చేయాలని సాగర్ ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు అంబటి సోమన్న అన్నారు. గురువారం సాగర్ హిల్‌కాలనీలోని ఎమ్మెల్యే నివాసంలో సదస్సుకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బుసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, సరోత్తంరెడ్డి, యారయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

● లయన్స్‌క్లబ్ రీజనల్ చైర్మన్ గాజుల రాజేష్

దేవరకొండ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): దేవరకొండ లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని లయన్స్ క్లబ్ రీజనల్ చైర్మన్ గాజుల రాజేష్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వస్కుల సత్యనారాయణ అన్నారు. దేవరకొండలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వస్కుల సత్యనారాయణ, తండ్రి ముత్యాలు జ్ఞాపకార్థం పట్టణంలోని బస్‌సెంటర్లు, ప్రభుత్వ ఆసుపత్రి, కోర్టు, ప్రధాన కూడలిలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బెంచీలను గురువారం వారు ప్రారంభించి మాట్లాడారు. పట్టణంలోని ప్రయాణికులు, ప్రజల సౌకర్యార్థం లయన్స్‌క్లబ్ బెంచీలు ఏర్పాటు చేసిందని తెలిపారు. లయన్స్‌క్లబ్ గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత కంటి, వైద్యశిబిరాలు నిర్వహించి సేవలందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ కార్యదర్శి ప్రభాకర్, శ్యాంసన్, నీల బుచ్చయ్య, జగిని కృష్ణయ్య, రుక్మారెడ్డి, నారాయణసింగ్, గోవర్ధన్, వెంకటేశ్వరరావు, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యను సద్వినియోగం చేసుకోవాలి


బడిబాటలో పాల్గొన్న ఎంఈవో బాలునాయక్, ఉపాధ్యాయులు

మిర్యాలగూడటౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో లావూరి బాలునాయక్ కోరారు. గాంధీపార్కు ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన బడిబాట కార్యక్ర మంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సర్కారు బడుల్లో చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం పుస్తకాలు, నోట్‌బుక్స్ డ్రస్సులు అందిస్తుందని పేర్కొన్నారు. తలిదండ్రు లు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం కురువా, ఉపాధ్యాయులు వెంకటరమణాచారి, ప్రవీణ్‌రెడ్డి, రాంరెడ్డి, కిర ణ్, సైదులు, పార్వతి, పద్మ, సంధ్య, రజిత, సౌమ్య నాగమణి, బేగం పాల్గొన్నారు.

కృష్ణపట్టెలో కొనుగోలు కేంద్రం ప్రారంభం


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీఎం నర్సింహ

తిరుమలగిరి(సాగర్), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కృష్ణపట్టెలో సుమారు ఎనిమిది సంవత్సరాలుగా వరిని సాగు చేస్తున్నా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయలేదు. దీంతో రైతుల ఇబ్బందులను వెలుగులోకి తీసుకొస్తూ 'కృష్ణపట్టెలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించరూ' అనే కథనాన్ని ఈనెల 10న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. దీంతో తక్షణమే స్పం దించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో గురువారం చింతలపాలెం గ్రామంలో ఏపీఎం నర్సింహ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాల ని, రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐకేపీ సీసీ తంగమణి, సమభావన సంఘం అధ్యక్షురాలు సింగం సంధ్య, కార్యదర్శి గోవిందమ్మ, కోశాధికారి షేక్ జెహరాబీ, రైతులు నల్లబోతు కాశయ్య, సింగం కోటేశ్వర్‌రావు, పున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు


పాములపాడులో రక్షణకవచం లేకుండా ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్.

- ఏర్పాటు చేయని రక్షణ వలయాలు
- మృత్యువాత పడుతున్న మూగజీవాలు
- నష్టపోతున్న అన్నదాతలు
- పట్టించుకోని అధికారులు

మాడ్గులపల్లి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ వలయాలు లేక ప్రమాదకరంగా మారడంతో పాటు పశువుల పాలిట శాపంగా మారుతున్నాయి. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా మండలంలోని ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వీధుల్లో నడవాల్సిన పరిస్థితి నెలకొంది. విద్యుదాఘాతంతో మూగజీవాలు మృత్యువాత పడుతున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలపరిధిలోని తోపుచర్ల, ఇందుగుల, ఆగామోత్కూర్, చిరుమర్తి, గుర్రప్పగూడెం, భీమనపల్లి, కల్వలపాలెం, బొమ్మకల్, దాచారం, పాములపాడుతో పాటు పలు గ్రామాల శివార్లలో ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కవచాలు ఏర్పాటు చేయలేదు. అంతేకాక పలు గ్రామాల్లో ఉన్న లూజ్‌పోల్స్ కారణంగా గాలిదుమారానికి విద్యుత్‌వైర్లు తెగి నిత్యం ప్రమాదాలకు కారణమవుతున్నా విద్యుత్ అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో చాలా సంవత్సరాల క్రితం వేసిన విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరాయి. అవి ఎప్పుడు కూలుతాయోనని నిత్యం ప్రజలు భయపడుతూ కాలం వెల్లదీస్తున్నారు. అంతేకాక పంటపొలాలు పలు వీధుల్లో విద్యుత్ తీగలు చేతికందే విధంగా ప్రమాదకరంగా కిందకు వేలాడుతున్నాయి. దీంతో ప్రజలు, రైతులు నిత్యం బిక్కుబిక్కుమంటూ తమ వ్యవసాయ పనులను చేసుకోవాల్సి వస్తుంది. పంటపొలాల్లో మేత కోసం వెళ్లిన గేదెలు, ఇతర పశువులు వేలాడుతున్న విద్యుత్ తీగలు, తెగి కిందపడిపోయిన తీగలు తగిలి మృతిచెందిన సంఘటనలు చాలా ఉన్నాయి. మండలంలోని ట్రాన్స్‌ఫార్మర్లతో పాటు శిథిలావస్థకు చేరిన స్తంభాలను తొలగించి నూతన స్తంభాలను ఏర్పాటుచేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మృత్యువాత పడుతున్న మూగజీవాలు

మాడ్గులపల్లి మండలంలోని గోపాలపురం, ఇందుగుల, కల్వలపాలెం గ్రామాల్లో విద్యుదాఘాతానికి మూగజీవాలు బలవుతున్నాయి. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. అదేవిధంగా మండలంలో 28 గ్రామపంచాయతీలు ఉండగా అన్ని గ్రామాల్లో లూస్ పోల్స్ కారణంగా విద్యుత్ అంతరాయం ఏర్పడడంతో పాటు ప్రమాదానికి కారణమవుతున్నాయి. ముఖ్యంగా కల్వలపాలెం, సీత్యాతండా, పాములపాడు, పోరెడ్డిగూడెం, తోపుచర్ల, గండ్రవానిగూడెం,



ఇందుగుల, బొమ్మకల్, ధర్మాపురం, కన్నెకల్, గోపాలపురం, కుక్కడం గ్రామాల్లో ఎక్కువగా లూస్ పోల్స్ ఎక్కువగా ఉన్నాయని, విద్యుత్ అధికారులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రక్షణ కవచాలు ఏర్పాటు చేయాలి



మండలంలో ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కవచాలు లేకపోవడంతో పశువులు వాటికి తగిలి మృత్యువాత పడుతున్నాయి. దీంతో పాడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కవచాలు ఏర్పాటుచేయాలి. ఈ విషయమై పలుమార్లు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్లతో రైతుల ప్రాణాలకు కూడా ముప్పు ఉంది. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టు రక్షణ ఏర్పాటుచేయాలి.

\- బంటు వెంకటేశ్వర్లు, పాములపాడు

ప్రతిపాదనలను పంపించాం

మాడ్గులపల్లి మండలం పరిధిలోని ఆయా గ్రామాల్లో లూస్‌పోల్స్ సమస్య ఉంది. వీటికి అన్ని గ్రామాల్లో లూస్‌పోల్స్ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. గ్రామాల్లో రైతులు పంటలు కోస్తున్నారు. అవి పూర్తవగానే గ్రామాల్లో స్తంభాలను ఏర్పాటు చేయించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తాం.

\- మణిదీప్, విద్యుత్‌శాఖ ఏఈ

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి : బాలునాయక్


రైతులకు స్పింకర్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. దేవరకొండ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఉద్యానవన, పట్టు పరిశ్రమలశాఖ ఆధ్వర్యంలో సూక్ష్మసేద్యం పరికరాలు, స్పింకర్లను రైతులకు పంపిణీ చేసి మాట్లాడారు. రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏక కాలంలో రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. భూమిలేని నిరుపేద కూలీలకు ఉపాధిహామీ పథకంలో 20 రోజుల పాటు పనిచేసినవారందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎం.ఎ.సిరాజ్‌ఖాన్, ముక్కమళ్ల వెంకటయ్యగౌడ్, కొండ్ర శ్రీశైలంయాదవ్, మారేపాకల అరుణసురేష్‌గౌడ్, లోకసాని శ్రీధర్‌రెడ్డి, కొర్ర రాంసింగ్, కిన్నెర హరికృష్ణ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ ద్వారా రోగులకు ఖరీదైన వైద్యం


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ మువ్వా రామారావు

● డాక్టర్ మువ్వారామారావు

మిర్యాలగూడ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశ్రీ ద్వారా పేద రోగులకు ఖరీదైన వైద్యసేవలు అందిస్తున్నట్లు జ్యోతి హస్పిటల్ వ్యవస్థాపకుడు డాక్టర్ మువ్వా రామారావు అన్నారు. పట్టణంలోని ఆస్పత్రిలో గురువారం నిర్వహించిన సమావేశంలో వైద్య బృందంతో కలిసి ఆయన మాట్లాడారు. అన్ని గ్రామాల్లో ఉచిత వైద్యశిబిరాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆర్ఎంపీలు, ఏజెంట్ల ద్వారా రోగులను ఆసుపత్రికి రప్పించుకునే విధానానికి వ్యతిరేకంగా ఇంతకాలం పనిచేస్తూ వచ్చామని అన్నారు. 1996లో వైద్య పట్టా అందుకున్న రోజునే జీవిత భాగస్వామి వైద్యురాలు జ్యోతితో కలిసి స్వంత ప్రాంతంలోనే ఆస్పత్రి నిర్మించి వైద్య సేవలు అందిచాలని నిర్ణయించుకున్నామని అన్నారు. మాకు కుమారుడు, కోడలు వైద్యసేవలు అందించడంలో తోడయ్యారని అన్నారు. రోగులకు అన్ని విభాగాలలో వైద్య సేవలు అందించేందుకు అధునాతన వైద్యపరికరాలను సమకూర్చినట్లు పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ సేవల ద్వారా ఖరీదైన గుండె జబ్బులకు సైతం ఉచితంగా అందిస్తున్నట్లు వెల్లడించారు. పేద రోగుల ప్రాణాలు కాపాడుతున్నామన్నారు. ఆరోగ్యశ్రీ సేవలను గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగం ఇతర విభాగాలకు వర్తింపచేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. సమావేశంలో కార్డియాలజీ వైద్యులు వెంకటేష్, గ్రాస్ట్రో ఎంట్రాలజీ వైద్యనిపుణులు మువ్వా శ్రీహర్ష, అదిల్‌బాషా, గైనిక్ ప్రత్యేక వైద్య నిపుణులు మువ్వా జ్యోతి, ఐవీఎఫ్ స్పెషలిస్ట్ మువ్వా అమూల్య తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం సమృద్ధిగా తీసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో సక్కుబాయి

చింతపల్లి, మాడ్గులపల్లి, చందంపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యో తి): గర్భిణులు, బాలింతలు పోషకాహారం సమృద్ధిగా తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చని ఐసీడీఎస్ సీడీపీవోలు సక్కుబాయి, చం ద్రకళ, సూపర్‌వైజర్ సుశీల అన్నారు. పోషణ్ పక్వాడాలో భాగం గా గురువారం చింతపల్లి, మాడ్గులపల్లి, చందంపేట మండలాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో వారు పాల్గొని మాట్లాడారు. గర్భం దాల్చిన మహిళలందరూ 45రోజుల లోపు తమ వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. పాలు, గుడ్లు, చేపలు, కూరగాయలు అధిక మొత్తంలో తీసుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, విటమిన్, ఐరన్ కలిగిన పదార్థాలు తీసుకోవడం వల్ల పుట్టే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని సూచించారు. ప్రతి ఒక్క రూ పోషకాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యవంతులుగా ఉంటారని సూచించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలను నిర్వహించారు.



చందంపేట: చిత్రియాల ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

చింతపల్లి మండలకేంద్రంలోని పీహెచ్‌సీలో నిర్వహించిన కార్యక్రమంలో మండల వైద్యాధికారి శ్రీదేవి, ఇక్బాల్, అంగన్‌వాడీ టీచర్ పద్మ పాల్గొన్నారు. మాడ్గులపల్లి మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన సమావేశంలో తహసీల్దార్ సురేష్, ఏపీఎం చంద్రశేఖర్, ఎంఈవో వెంకటమ్మ, ఏపీఎం చంద్రకాంత్, సూపర్‌వైజర్ జె.నాగమణి పాల్గొన్నారు. చందంపేట మండలంలోని చిత్రియాల అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రాధిక, గోవిందమ్మ, అలివేలు, మంజుల, వలంటీర్లు శ్రీలత, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి


దేవరకొండలో విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

దేవరకొండ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): సూర్యాపేటలో న్యాయవాది మంగ్తాపురం కిషోర్‌పై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని దేవరకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమ మహేశ్వర్ డిమాండ్ చేశారు. గురువారం దేవరకొండలో కోర్టు విధులను బహిష్కరించి నిరసన తెలిపి మాట్లాడారు. రాష్ట్రంలో ఇటీవల న్యాయవాదులపై దాడులు పెరిగిపోయాయని, న్యాయవాదుల రక్షణ చట్టాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కిషోర్‌పై దాడిచేసిన నిందితులను గుర్తించి శిక్షించాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి సురేష్, సీనియర్ న్యాయవాదులు గాజుల ఆంజనేయులు, జగదీశ్వర్, అశోక్‌గౌడ్, రవి, శంకర్, శ్రీనివాస్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

నిడమనూరు: నిడమనూరులో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ న్యాయవాదిపై జరిగిన దాడి హేయమని, దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి ఉన్నం చినవీరయ్య, పొదిల శ్రీనివాస్, రాకా సి మేఘారెడ్డి, పుల్లారెడ్డి, బీఎస్ఎన్ రాజు, మాయకోటి వినోద్, నాగరాజు, వెంకన్ననాయక్, మట్టయ్య, జయమ్మ, భైరం రవి పాల్గొన్నారు.

లక్కీడ్రా విజేతలకు బహుమతుల అందజేత


బహుమతులు అందజేస్తున్న పీసీ ఇన్‌చార్జి గిరిధర్‌రావు, ఎస్ఆర్ వెంకన్న

దేవరకొండ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి 23వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ఆంధ్రజ్యోతి కార్ అండ్ బైక్ రేస్‌ను నిర్వహించింది. నల్లగొండలోని యూనిట్ కార్యాలయంలో జరిగిన లక్కీడ్రాలో దేవరకొండకు చెందిన ఇద్దరు పాఠకులు బహుమతులకు ఎంపికయ్యారు. గురువారం దేవరకొండ పట్టణంలోని ఆంధ్రజ్యోతి పీసీ సెంటర్‌లో గురువారం దేవరకొండ పీసీ ఇన్‌చార్జి గాదె గిరిధర్ రావు, దేవరకొండ డివిజన్ సర్క్యులేషన్ ఇన్‌చార్జి వెంకన్న విజేతలకు బహుమతులు అందజేశారు. బహుమతులు అందుకున్న ఎస్ఎస్ చారి, అలైఖ్యలు మాట్లాడుతూ ఆంధ్రజ్యోతి పత్రిక లక్కీడ్రాలో గెలుపొంది బహుమతులు అందుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. ఆంధ్రజ్యోతి ప్రజల ఆదరాభిమానాలను చూరగొంటుందని, ప్రజా సమస్యలపై వార్తలు రాస్తూ అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి పత్రిక దేవరకొండ ఏజెంట్లు షరీఫ్, మణికంఠ, మాజీ కౌన్సిలర్ గాజుల మురళి, కదారి కిరణ్, గణేష్ పాల్గొన్నారు.

ఆస్పత్రిలో అగ్నిమాపక వారోత్సవాలు

హాలియా, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక వారోత్సవాలను హాలియా మునిసిపాలిటీలోని నిర్మల హాస్పటల్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పటల్‌లో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అగ్నిమాపక సిబ్బంది అవగాహన కల్పించారు. అనంతరం వారోత్సవాల పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది ఎమ్.మల్లయ్య, ఎల్ఎఫ్ సురేందర్, వీపీపీ రాంరెడ్డి, ఎఫ్ఎమ్ గోవిందయ్య, నాగరాజు, రాము, హెచ్‌జీఎఫ్ఎం మంగయ్య తదితరులు పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలి: సీపీఐ


రాస్తారోకో నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

వేములపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యో తి): దశాబ్దాల కాలంగా మండల కేంద్రంలో సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయకపోవడం బా ధాకరమని సీపీఐ మండల కార్యదర్శి జిల్లా యాదగిరి అన్నారు. సర్వీస్ రోడ్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో గురువారం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాస్తారోకో ఆయన పాల్గొని మాట్లాడారు. నార్కట్‌పల్లి - అద్దంకి రహదారి విస్తరణలో భాగంగా సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాల్సి ఉన్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. సర్వీస్ రోడ్డు లేక నాలుగు నెలల వ్యవధిలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మిర్యాలగూడ, దామరచర్ల మండలాల సీపీఐ కార్యదర్శులు ఎండి.సయ్యద్, లింగానాయక్, నాయకులు మద్దిరాల వెంకటరెడ్డి, వల్లంపట్ల వెంకన్న, రంగారెడ్డి, కొర్ర శ్రీనివాస్, పుట్టల కృష్ణయ్య, పెదపంగ ఆనందం, సత్యం, పరమేష్, బీమయ్య, మహే ష్, సుధాకర్, నెహ్రూనాయక్, విజయ్, మురళి, రాము పాల్గొన్నారు.

భూభారతి చట్టంపై అవగాహన సదస్సు రేపు

హాలియా, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): భూభారతి చట్టంపై ఈ నెల 19వ తేదీ శనివారం కొత్తపల్లి రైతు వేదికలో అవగాహన సదస్సును నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రఘు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి, అధికారులు హాజరుకానున్నట్లు తెలిపారు.

ఔట్‌సోర్స్ ఏజెన్సీలపై

నియంత్రణ ఏదీ...!

(5వ పేజీ తరువాయి)

ఆరోపణలు వచ్చాయి. పలు ఏజెన్సీలపై అందులో పనిచేసే కార్మికులు, ఉద్యోగులే తిరగబడి ఆందోళనలు చేసిన ఘటనలు జిల్లాలో ఇటీవల కూడా కొనసాగాయి. జిల్లా కలెక్టర్ అధ్యక్షుడిగా ఉండే ఔట్‌సోర్స్ ఏజెన్సీల ఎన్‌ప్యానల్ కమిటీ ఏజెన్సీల పనితీరుని ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాల్సి ఉండగా, జిల్లాలో చాలాకాలం నుంచి ఈ తనిఖీలు, రికార్డుల పరిశీలన కొనసాగడం లేదు. ప్రధానంగా ఏజెన్సీలపై కనీస పర్యవేక్షణ కొరవడింది. కొన్ని ఏజెన్సీలు రాజకీయ నాయకులకు బినామీలుగా మారిపోయాయనే ఆరోపణలున్నాయి. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని ఔట్‌సోర్స్ ఏజెన్సీలకు కనీస ప్రమాణాలు రూపొందించి, క్రమబద్ధీకరించాలనే సూచనలు వస్తున్నాయి.